

ఉపాధి హామీ పథకం పనులు చేసిన వారు బిల్లుల కోసం గగ్గోలు పెడుతున్నారు. మెటీరియల్ నిధులతో పనులు చేసి తొమ్మిది నెలలైనా ఒక్క రూపాయి కూడా విడుదల కాక ఇబ్బందులు పడుతున్నారు. ఆదాయం అటుంచితే పెట్టుబడులకు వడ్డీలు కూడా వచ్చే అవకాశం లేదని వాపోతున్నారు. నెలల తరబడి బిల్లులు రాక.. తెచ్చిన అప్పులు తీర్చే మార్గం కన్పించక ఆందోళన చెందుతున్నారు. ఈ పనులు చేసిన వారంతా గత ఎన్నికల్లో గ్రామాల్లో టీడీపీ గెలుపు కోసం శ్రమించిన వారే కావడంతో కీలక నేతలు కూడా ఇరకాటంలో పడ్డారు. అటు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించలేక, ఇటు కిందిస్థాయి నేతల ఒత్తిడి భరించలేక సతమతమవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు విడుదల కాక ఈ పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది.

ఉపాధి బకాయిలు

రూ.100 కోట్లు

తొమ్మిది నెలలు దాటినా అందని బిల్లులు

అధికారంలోకి రాగానే భారీగా పనులు

గతంలో 2014-19 మధ్య కాలంలో జిల్లాలో వెయ్యికోట్లతో మెటీరియల్ కోటా పనులు జరిగాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిపై అంత శ్రద్ధ చూపించకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు పెద్దగా జరగలేదు. అదే సమయంలో అప్పట్లో మెటీరియల్ కోటా కింద అందుబాటులోకి వచ్చిన నిధులలో అధిక భాగం జగనన్న కాలనీల్లో లెవలింగ్ పనులు పేరుతో వైసీపీ నేతలు దోచేశారు. తిరిగి ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక మళ్లీ ఉపాధి మెటీరియల్ కోటా నిధుల ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. అలా జిల్లాలో గత ఏడాది అక్టోబరులో ఒక్కో నియోజకవర్గానికి సగటున రూ.15 కోట్ల వంతున రూ.120 కోట్లు.. ఎస్సీ జనాభా అధికంగా ఉన్న గ్రామాల్లోని దళితవాడల్లో పనులకు రూ.35 కోట్లు, పశువుల షెడ్లు (గోకులాలు), ఇతర మరికొన్ని పనులకు కలిపి సుమారు రూ.180 కోట్ల విలువైన పనులను ఈ కోటా కింద మంజూరు చేశారు.

ఒంగోలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కోటా నిధుల కింద పనులు చేసిన వారు ఆ బిల్లులు రాక గగ్గోలు పెడుతున్నారు. తొమ్మిది నెలలుగా ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. జిల్లాలో సుమారు రూ.100 కోట్లకుపైగానే ఈ పథకం కింద చేసిన పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నూటికి 90శాతం నిధులను కేంద్రం ఇస్తుండటంతో రాష్ట్రంలో పెద్దఎత్తున కూలీలకు ఉపాధి పనులు, తద్వారా వచ్చే మెటీరియల్ కోటా నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన వంటి పనులు చేశారు.

మూడు నెలలకే ఆగిన గ్రీన్‌చానల్ చెల్లింపులు

తొలుత గ్రీన్‌చానల్ పేరిట ప్రతి గురువారం చెల్లింపులు చేశారు. దీంతో అధికారులు ఒత్తిడి చేసి మరీ పనులు చేయించారు. మరో వైపు రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో వచ్చిన పనులు కావడంతో ఎన్నికల సమయంలో క్రియాశీలకంగా పనిచేసిన గ్రామ స్థాయి నేతలు పోటీ పడి మరీ పనులు దక్కించుకుని చేశారు. అయితే రెండు, మూడు నెలలకే గ్రీన్‌చానల్ పేరుతో వారం వారం చేస్తున్న చెల్లింపులు నిలిచిపోయాయి. భారీగా బిల్లులు పేరుకుపోయాయి. మొత్తం మీద 2024-25 సంవత్సరంలో జిల్లాలో ఉపాధి పథకం కింద రూ.431.62 కోట్లు ఖర్చు చేశారు. అందులో కూలీలకు వేతన రూపంలో రూ.273.39 కోట్లు లభించాయి. మెటీరియల్ పనుల కింద రూ.158.20 కోట్లు ఖర్చయ్యింది. అంటే ఆ ఏడాది మెటీరియల్ కోటా కింద మంజూరు చేసిన రూ.180 కోట్ల పనుల్లో రూ.158.20 కోట్ల పనులు జరిగాయి. చేసిన పనుల్లో రూ.99.70 కోట్లు మాత్రమే ఇప్పటివరకు చెల్లింపులు జరగ్గా ఇంకా ఆ ఏడాదికి సంబంధించి రూ.58.50 కోట్లు పెండింగ్ బిల్లులు ఉన్నాయి. ప్రస్తుత ఏడాది 2025-26లో జిల్లాలో రూ.376.05 కోట్లు ఈ పథకం కింద ఖర్చు కాగా అందులో రూ.251.67 కోట్ల మేర వేతనాలు లభించాయి. రూ.124.40 కోట్ల మెటీరియల్ కోటా నిధులు అందుబాటులోకి వచ్చాయి. ఈ మొత్తంలో రూ.230.38 కోట్ల వేతనాలు కూలీలకు అందాయి. ఇంకా రూ.21.29 కోట్లు రావాల్సి ఉంది.

- గ్రామస్థాయి నేతల గగ్గోలు
- ఉత్సాహంగా పనులు చేసి ఉసూరుమంటున్న వైనం
- వడ్డీలు కూడా రావని ఆందోళన

పాత బిల్లుల చెల్లింపు

మెటీరియల్ కోటా కింద అందుబాటులోకి వచ్చిన రూ.124.40 కోట్లలో రూ.82.26 కోట్లు విడుదలయ్యాయి. ఈ ఏడాది ఆ కోటా కింద పనులు పెద్దగా ఇవ్వకుండా ఆ నిధులను గతంలో 2014-19 మధ్య కాలంలో చేసిన పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ప్రాధాన్యం ఇచ్చారు. సుమారు రూ.35 కోట్లు అప్పటి బిల్లులు చెల్లింపులు చేయగా గత ఏడాది చేసిన పనులలో జనవరి వరకు ఉన్న మరికొంత బిల్లులు చెల్లించారు. అలా పోగా ఈ ఏడాది మెటీరియల్ కోటా నిధులలో ఇంకా రూ.42.12 కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉంది. అంటే ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు చేసిన పనులకు సంబంధించి సుమారు రూ.100.62 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఏడాది సంక్రాంతి నుంచి ఇప్పటివరకు ఒక్కరికి ఒక్క రూపాయి కూడా రాక పనులు చేసిన వారు గగ్గోలు పెడుతున్నారు.

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకూ జిల్లాలో ఉపాధి పథకం వ్యయం, నిధులు మంజూరు వివరాలు ఇవీ..

- మొత్తం ఉపాధి పథకం వ్యయం: రూ. 685.74 కోట్లు
- వేతనాల రూపంలో కూలీలకు వచ్చింది : రూ. 525.06 కోట్లు
- ఇప్పటివరకు చెల్లించిన వేతన మొత్తం: రూ.503.78 కోట్లు
- మెటీరియల్ కోటా వ్యయం : రూ.282.61 కోట్లు
- చెల్లింపు జరిగినది: రూ.181.96 కోట్లు
- పెండింగ్ బిల్లులు: రూ.100.62 కోట్లు



శంభో శంకర

- నేటి నుంచి కార్తీక మాసం ప్రారంభం
- నెలరోజులపాటు శివాలయాలు కళకళ
- వివిధ సంఘాల ఆధ్వర్యంలో వనభోజనాలు
- అయ్యప్ప దీక్షధారణలకూ ప్రాశస్త్యం

7

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను సమర్థంగా వినియోగించాలి

అధికారులకు కలెక్టర్ రాజాబాబు ఆదేశం : 7లో



పెద్దపులి దాడిలో మృతి చెందిన ఆవు దూడ

పెద్దపులి దాడిలో రెండు ఆవు దూడలు మృతి

పెద్ద దోర్నాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పెద్దపులి దాడి చేసి రెండు ఆవు దూడలను చంపింది. ఈ ఘటన మండలంలోని పెద్దబొమ్మలాపురం గ్రామం గండిచెరువు సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో మంగళవారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన గోగుల వెంకటయ్య, గాలి శ్రీనివాసరెడ్డి ఆవు దూడలు రెండు రోజుల క్రితం అటవీ ప్రాంతానికి మేతకు వెళ్లాయి. అవి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో యజమానులు అటవీ ప్రాంతంలో వెతుకుతుండగా ఆ రెండూ మృతి చెంది కనిపించాయి. పెద్దపులి దాడి చేసినట్లుగా ఆనవాళ్లు ఉన్నాయి. దీంతో వారు అటవీ శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.



వెంకటేశ్వర్లు మృతదేహం



కోటేశ్వరరావు మృతదేహం

ట్రాక్టర్ ప్రమాదంలో తండ్రీకొడుకు మృతి

సలకనూతలలో విషాదం

పొదిలి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ ప్రమాదంలో తండ్రీ కొడుకు మృతి చెందారు. ఈ ఘటన పొదిలి మండలం సలకనూతలలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. సలకనూతలకు చెందిన మాదాల కోటేశ్వరరావు (60), వెంకటేశ్వర్లు (25) తండ్రీకొడుకులు. ఇద్దరూ రైతులు. మంగళవారం సాయంత్రం వారు పశువుల కొష్టం వద్దకు వెళ్లారు. వెంకటేశ్వర్లు ట్రాక్టర్‌ను పక్కన నిలిపే క్రమంలో అది తండ్రి కోటేశ్వరరావుకు తగిలింది. దీంతో కిందపడిపోయిన అతనిపై నుంచి ట్రాక్టర్ వెళ్లిపోయింది. కంగారు పడిన వెంకటేశ్వర్లు ఒక్కసారిగా ట్రాక్టర్‌పై నుంచి దూకాడు. ఆ క్రమంలో బలమైన గాయమై ఆయన కూడా మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి

- జిల్లావ్యాప్తంగా ర్యాలీలు
- ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు
- ఒంగోలులో జోరువానలోనూ కార్యక్రమం
- పాల్గొన్న మంత్రి డాక్టర్ స్వామి, ఎమ్మెల్యేలు ఉగ్ర, బీఎన్, కలెక్టర్, ఎస్పీ

ఒంగోలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పోలీసు అమరవీరుల దినాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సర్కిల్ కేంద్రాలలో వివిధ వర్గాల వారితో అమరుల సేవలను కొనియాడుతూ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల కోసం, సమాజం కోసం పనిచేసి అమరులైన పోలీసులకు పలుచోట్ల ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, ఇతర వర్గాల వారు నివాళులర్పించారు. కొన్ని చోట్ల వర్షం పడుతున్నా కార్యక్రమాలు కొనసాగాయి. ఒంగోలులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, ఎమ్మెల్యేలు బీఎన్.విజయ్‌కుమార్, డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఇతర పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం జరిగే సమయంలో నగరంలో జోరువాన కురిసింది. వర్షంలో తడుస్తూనే వారంతా అమరవీరుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్థూపం వద్ద నివాళులర్పించారు. పోలీసు అమరులను తలుచుకుంటూ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి స్వామి మాట్లాడుతూ ప్రజలు, సమాజం కోసం కుటుంబాలకు దూరంగా ఉంటూ పోలీసులు, ఇతర భద్రతా సిబ్బంది చేస్తున్న త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు. అలాంటి వారు విధి నిర్వహణలో పలు కారణాలతో అమరులు అవుతున్నారని, వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి ఆదుకుంటున్నదని తెలిపారు. మార్కాపురంలో జరిగిన ర్యాలీలో అక్కడి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఎస్పీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే గిద్దలూరు, కంభం, వైపాలెం, పామూరు, కనిగిరి, దర్శి, పొదిలి, కొండపి, సింగరాయకొండ సర్కిల్ కేంద్రాలతోపాటు దోర్నాల, పుల్లలచెరువు ఇతర పలు మండల కేంద్రాల్లోనూ స్థానిక పోలీసు అధికారుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ర్యాలీలు జరిగాయి. వివిధ వర్గాల ప్రజలు, విద్యార్థులు, రెవెన్యూ, ఇతర పలు శాఖల అధికారులు ఈ ర్యాలీల్లో పాల్గొన్నారు.



ఒంగోలులో పోలీసు అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యేలు ఉగ్ర, విజయ్‌కుమార్, కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, మేయర్ గంగాడ సుజాత తదితరులు (ఇన్‌సెట్‌లో) నివాళులర్పిస్తున్న పోలీసు సిబ్బంది

అంతా అప్రమత్తం

- మొదలైన తుఫాన్ ప్రభావం
- ఒంగోలులో భారీ వర్షం
- ఇతర చోట్ల ఒక మోస్తరుగా..
- నేడు, రేపు భారీ వర్ష సూచన
- యంత్రాంగం అలర్ట్
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం
- 1077 నెంబరు కేటాయింపు

ఒంగోలు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాపై తుఫాన్ ప్రభావం కనిపిస్తోంది. సోమవారం రాత్రి నుంచి వర్షం పడుతోంది. ప్రత్యేకించి తూర్పు, దక్షిణ ప్రాంతాలలో అధికంగా కురుస్తోంది. మంగళవారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో జిల్లాలో సగటున 8.70 మి.మీ వర్షపాతం నమోదైంది. తిరిగి మంగళవారం పగటిపూట తెరపి లేకుండా జల్లులు పడుతున్నాయి. బంగాళాఖాతంలోని అల్పపీడనం మరింత బలపడి బుధవారం మధ్యాహ్నానికి వాయుగుండంగా.. అనంతరం తుఫాన్‌గా మారే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సమాచారం ఇచ్చింది. దాని వల్ల బుధ, గురువారాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీంతో అధికార యంత్రాంగం ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతోంది. ప్రత్యేకించి తీర ప్రాంతంలోని మండలాల్లో అధికారులను మరింత అప్రమత్తం చేశారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. దానికి 1077 నంబరును కేటాయించారు. మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లవద్దని కోరారు. ఇప్పటికే వెళ్లిన వారు తక్షణం వెనక్కు వచ్చేవిధంగా అప్రమత్తం చేశారు.



చెరువును తలపిస్తున్న ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ వద్ద కర్నూల్‌రోడ్డు

ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొంటాం : కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : జిల్లాకు భారీ వర్ష సూచన నేపథ్యంలో ఎలాంటి పరిస్థితినైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ రాజాబాబు వెల్లడించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తీరప్రాంతంలోని ఐదు మండలాల ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. అవసరమైన పక్షంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు కూడా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో కంట్రోలు రూంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్కడ 24 గంటలు విద్యుత్, పోలీస్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య, రెవెన్యూ, పశుసంవర్థక శాఖల సిబ్బందికి విడతల వారీగా విధులు కేటాయించినట్లు చెప్పారు.

నగర వీధులన్నీ జలమయం

ఒంగోలు నగరంలో మంగళవారం ఉదయం భారీ వర్షం కురిసింది. ప్రధాన వీధులు కాలువలు, చెరువులను తలపించాయి. సింగరాయకొండ, టంగుటూరు, కొత్తపట్నం, ఒంగోలు, జరుగుమల్లి, సంతనూతలపాడు, చీమకుర్తితోపాటు కనిగిరి నియోజకవర్గంలోని పలు మండలాల్లోనూ మంగళవారం పగలు ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది.

పోలీసుల పనితీరుపై ఎస్పీ ఆగ్రహం

నాగులుప్పలపాడు, మద్దిపాడు స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు

ఫిర్యాదులు పట్టించుకోకపోవడంపై మండిపాటు

7



నాగులుప్పలపాడు స్టేషన్‌లో ఎస్సైకి సూచనలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, పక్కన డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ శ్రీకాంత్

టీడీపీ నియోజకవర్గ నూతన కమిటీలు

సంతనూతలపాడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ నూతన కమిటీని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ నియమించారు. చీమకుర్తికి చెందిన గొల్లపూడి శ్రీనివాసరావు తెలుగుయువత ప్రెసిడెంట్‌గా, మద్దిపాడుకు చెందిన కొణిజేటి శివకుమార్ తెలుగు యువత జనరల్ సెక్రటరిగా, చేకూరపాడుకు చెందిన ఇంటూరి శ్రీనివాసరావు తెలుగురైతు ప్రెసిడెంట్‌గా, మద్దిపాడుకు చెందిన బాపట్ల వెంకయ్య తెలుగురైతు జనరల్‌సెక్రటరీగా, చీమకుర్తికి చెందిన గంగుల శివపార్వతి తెలుగుమహిళా ప్రెసిడెంట్‌గాను, పేర్నమిట్టకు చెందిన తేళ్లవరమ్మ తెలుగుమహిళ జనరల్ సెక్రటరీగా, ఎర్రగుడిపాడుకు చెందిన వేల్పుల శ్రీనివాసరావు బీసీ సెల్ ప్రెసిడెంట్‌గా, అమ్మనబ్రోలుకు చెందిన మాచవరపు సురేష్ బీసీ సెల్ జనరల్ సెక్రటరీగా, దేవరపాలెంకు చెందిన పోలంరెడ్డి శ్రీనివాసరెడ్డి ఐటీడీపీ ప్రెసిడెంట్‌గా, భట్లమాచవరంకు చెందిన సాధుకొండలరావును ఐటీడీపీ జనరల్ సెక్రటరీగా నియమించారు.

మండల కమిటీ నియామకం

సంతనూతలపాడు టీడీపీ మండల కమిటీని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ నియమించారు. పార్టీ మండలాధ్యక్షుడిగా మద్దినేని హరిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అబ్బూరి శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్‌గా మల్లవరపు రామక్రిష్టారెడ్డి, జనరల్‌సెక్రటరీగా రావులపల్లి వెంకటసురేష్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కొండసింగ్‌రాజు, ఈర్ల మాధవి, పాతూరి రాంబాబు, సెక్రటరీలుగా గడ్డం ఇస్రాయేలు, నాదెండ్ల ఆంజనేయులు, నలగట్ల వెంకపద్మ, ట్రెజరర్‌గా దాసరిబాబూరావును నియమించారు.

ఎన్‌జీపాడు టీడీపీ మండలాధ్యక్షుడిగా 'తేళ్ల'

నాగులుప్పలపాడు: తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులను నియమిస్తూ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పల్లా శ్రీనివాసరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ మండలాధ్యక్షుడిగా తేళ్ల మనోజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా పీకా బైరాగి, ప్రధాన కార్యదర్శిగా కాకర్ల లక్ష్మీవరప్రసాద్ (చిన్నా), కార్యదర్శులుగా గద్దల రమేష్, సుదర్శి మధు, కన్నా గోవిందమ్మ, సహాయ కార్యదర్శులుగా తేళ్ల ఎలీషా, కుంచాల ప్రసన్నబాబు, సామినేని సందీప్, ట్రెజరర్‌గా జాగర్లమూడి వేణుగోపాల్‌లను నియమించారు. ఈమేరకు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కార్యాలయం ద్వారా ప్రకటన జారీ చేశారు.

మద్దిపాడు మండలాధ్యక్షుడిగా 'ఉప్పుగుండూరి'

మద్దిపాడు: తెలుగుదేశం పార్టీ మండల కార్యవర్గాన్ని ప్రకటించారు. పార్టీ మండలాధ్యక్షుడిగా ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా ముత్తనపల్లి రామలింగయ్య, ప్రధాన కార్యదర్శిగా మందపల్లి శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మోపర్తి లాల్‌బహదూర్, దాట్ల శివరామగోపాలరాజు, ఇంకొల్లు రామకృష్ణ, సెక్రటరీలుగా బోయపాటి వీరాంజనేయులు, కుంచాల శ్రీనివాసరావు, దమ్ము లక్ష్మీనారాయణ, కోశాధికారిగా ఈమని కళ్యాణిలను నియమించారు.

హత్యాకాండపై రిటైర్డ్ జడ్జితో విచారణ చేయించాలి



మాట్లాడుతున్న సంజీవ్‌కుమార్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గుడ్లూరు మండలం దారకానిపాడు గ్రామంలో తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు దారుణ హత్యపై రిటైర్డ్ జడ్జితో సమగ్ర విచారణ చేయించి అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ డిమాండ్ చేశారు. ఒంగోలులోని కాపు సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా లక్ష్మీనాయుడు మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. లక్ష్మీనాయుడుపై హత్యతో పాటు ఆయన తమ్ముళ్ళు పవన్, భార్గవ్‌లపై కూడా హత్యాయత్నం జరిగిందన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నరహరి సాంబయ్య, ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు, జేష్ఠ ప్రసాద్, ఇందుర్తి మస్తాన్‌కుమార్, హనుమంతరావు, శెట్టి పాపారావు, మేకల నారాయణ, శివ, చింతలపల్లి నారాయణ, వసాని అంకబాబు, రావెళ్ల రాఘవ, కోలా వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలి

● కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాత్రి జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో ఇసుక లభ్యత, రవాణా, వర్షాకాలం దృష్ట్యా ముందుగానే ప్రజలకు అవసరమైన స్థాయిలో యార్డుల్లో అందుబాటులో ఉంచడం తదితర అంశాలపై గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్థానికంగా ఉన్న వాగులు, వంకలలో లభ్యమయ్యే ఇసుకను స్థానికులే వినియోగించుకోవాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినా కొందరు అక్రమంగా జరుగుమల్లి నుంచి ఒంగోలుకు తీసుకున్నారని, దీంతో యార్డుల నుంచి సరఫరా చేసే నిర్వహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రవాణాదారులు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ఇసుక విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, ఆర్డీవో కళావతి, డీఎస్పీ శ్రీనివాసరావు, డీటీసీ సుశీల, ఆర్‌డబ్ల్యూఎస్‌ఈ బాలశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండలో మంత్రి స్వామి పూజలు



ధ్వజస్తంభం వద్ద నమస్కరిస్తున్న మంత్రి స్వామి

అద్దంకి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శింగరకొండ శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి దంపతులు, కుటుంబసభ్యులతో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో పూజారులు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి స్వామి మాట్లాడుతూ స్వామి వారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరినట్లు తెలిపారు.

రోడ్డును ధ్వంసం చేస్తున్న టిప్పర్లు..అడ్డుకున్న స్థానికులు



మట్టిరోడ్డులో ఇరుక్కుపోయిన గ్రావెల్ టిప్పర్

సంతనూతలపాడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎండ్లూరు డొంక నుంచి కామేపల్లివారిపాలెం వెళ్లే రహదారిని వెంచర్ కోసం గ్రావెల్ తోలుతున్న టిప్పర్లు ధ్వంసం చేస్తున్నాయని మంగళవారం స్థానికంగా నివాసం ఉండే అంబేడ్కర్‌నగర్ వాసులు అడ్డుకున్నారు. దీంతో కొదిసేపు టిప్పర్ డ్రైవర్లతో వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ వర్షాలు తగ్గిన తర్వాత వెంచర్‌లో గ్రావెల్ తోలుకోవాలని, లేకుంటే ఉన్న మట్టిరోడ్డు ధ్వంసం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఓ డ్రైవర్ టిప్పర్‌ను ముందుకు తీసుకెళ్లగా మట్టిరోడ్డులో కుంగిపోయింది. దీంతో స్థానికులు స్పందిస్తూ గ్రావెల్ ట్రిప్పర్‌లను ఆపకుంటే అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

టీడీపీ చీమకుర్తి మున్సిపాలిటీ, మండల కార్యవర్గాలు

చీమకుర్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ చీమకుర్తి మున్సిపాలిటీ అధ్యక్షుడిగా ముప్పూరి చలమయ్య, ఉపాధక్షుడిగా ధనేకుల రమణయ్య, ప్రధాన కార్యదర్శిగా అవనిగడ్డ శేషయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పూనాటి వెంకట్రావు, షేక్ వనీఫ్, ఎస్.కోటేశ్వరరావు, బత్తుల శ్రీను, తన్నీరు వెంకటవంశీ, సునీల్‌కుమార్‌రెడ్డి, కట్టా కుమారిలను నియమించారు. అలాగే పార్టీ మండల అధ్యక్షుడిగా గొట్టిపాటి రాఘవరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కూనంనేని లింగయ్య, ఉపాధ్యక్షుడిగా యానం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా ఇస్తర్ల ఏడుకొండలు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పుట్టా శ్రీనివాసరావు, బొమ్మల చినఅంకయ్య, పల్లపు శ్రీనివాసరావు, పాలగిరి జ్యోతి, సత్రపు నాగేంద్రబాబు, దాసరి లక్ష్మీనారాయణ, తూమాటి వెంకట్రావులను నియమించారు. ఈ సందర్భంగా పార్టీ పదవులు పొందిన నాయకులు మంగళవారం ఒంగోలులో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

బ్యాంక్ ఉద్యోగిపై దాడి

ఒంగోలు క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఉద్యోగిపై ఖాతాదారుడు దాడి చేసిన సంఘటన ఒంగోలు ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న ఇండియన్ బ్యాంక్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. వివరాల్లోకి వెళితే.. అంకబాబు తన బ్యాంక్ ఖాతాలో నగదు కట్ కాగా దీనిపై అసిస్టెంట్ మేనేజర్ షపీఅహ్మద్‌ను వివరణ అడిగాడు. ఈ విషయంలో బ్యాంక్ ఉద్యోగులంతా ఒక్కటై ఖాతాదారుడు అంకబాబు పట్ల అనుచితంగా మాట్లాడాడు. దీంతో అక్కడ పనిచేస్తున్న కాకర్ల రాజు చేయి చేసుకున్నాడు. ఈమేరకు రాజుపై అంకబాబు తిరగబడగా గాయపడిన రాజు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్ళి అక్కడ నుంచి ఫిర్యాదు చేయగా తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి చేశారు.

అదనపు ఎస్పీ బదిలీ..విజిలెన్స్‌లో బాధ్యతలు

ఒంగోలు క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏఎస్పీగా పనిచేస్తున్న కె.నాగేశ్వరరావును బదిలీ చేసి ఒంగోలులో రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అక్కడ ఆర్‌వీఅండ్‌ఈవోగా పనిచేస్తున్న కొల్లి శ్రీనివాసరావును బదిలీ చేశారు.

నగరంలో కుండపోత వాన

● రహదారులు జలమయం
● పలు కాలనీలలో అవస్థలు
● పొంగిపొర్లిన డ్రైనేజీ కాలువలు



కొత్తపట్నం బస్టాండ్ వద్ద ప్రవహిస్తున్న వర్షపునీరు



మంగమూరు జంక్షన్ వద్ద కురుస్తున్న వర్షం

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో బుధవారం తెల్లవారుజామున ఒంగోలులో కుండపోత వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి నగరం జలమయం అయింది. ప్రధాన వీధుల్లో వర్షపునీరు ఏరులై పారింది. ఇదిలా ఉండగా శివారు కాలనీల్లో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. ముసురు వాతావరణంతో జనాలు ఇళ్ళకే పరిమితం కాగా, వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఇదిలా ఉండగా ఉదయం పూట కాస్తంత తెరపిచ్చినా, మధ్యాహ్నం నుంచి ముసురుతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు.

కాలనీలు జలమయం

ఎడతెరిపి లేకుండా కూడిన వర్షంతో నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. స్థానిక చర్చిసెంటర్, భాగ్యనగర్, దారావారితోట, రైల్వేస్టేషన్ బజారు. పీవీఆర్ బాలుర పాఠశాల, కర్నూలు రోడ్ లతోపాటు, నగర లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి చెరువులను తలపించాయి. వెంకటేశ్వరకాలనీ, బలరాంకాలనీ, బిలాల్ నగర్, కరుణా మిలటరీ కాలనీ, బాలినేని భరత్ కాలనీ, ఇందిరాకాలనీ, గుర్రజంజాషవా కాలనీ, మదర్‌థెరిస్సా కాలనీ, ప్రగతి కాలనీ, చినమల్లేశ్వర కాలనీలతోపాటు నెల్లూరు బస్టాండ్, ఆర్టీసీ ఆవరణం వర్షపునీటితో నిండిపోయాయి. ఇక మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్థంగా మారింది. వాన నీటికి తోడు, మురుగునీరు రోడ్లపై ఏరులై పారింది. దారావారితోట, జర్నలిస్ట్‌కాలనీ, ఇందిరమ్మ కాలనీ, రాజీవ్ గృహకల్ప, భాగ్యనగర్, హౌసింగ్ బోర్డు కాలనీల్లో నిలిచి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

చెరువులా కర్నూలు రోడ్డు

నగరంలోని కర్నూలురోడ్డులో వర్షపు నీరు నిలిచి ఆవైపు నుంచి వచ్చే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. వాహనదారులు జోరువానలోనే గంటలకొద్ది ఇబ్బందిపడ్డారు. స్థానిక పాత తులసీరామ్ థియేటర్ వద్ద ఓవైపు వర్షపు నీరు, మరోవైపు మురుగు నీరు రోడ్డుపైకి చేరడంతో చెరువులా మారింది.

కొండపి ప్రాంతంలో ఆగని వర్షం

కొండపి: మండలంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం కూడా ఓ మోస్తరు వర్షం కురిసింది. పక్షం రోజులుగా అడపాదడపా పడుతూనే ఉంది. వర్షాలకు పొగ నారుమడులు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. మరోవైపు పొలాలు ఆరుదల లేక రైతులు పొగ మొక్కలు వేసేందుకు వేచి చూస్తున్నారు.

పొన్నలూరు: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో 4సెం.మీ వర్షపాతం నమోదైంది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి.

పోలీసు త్యాగాలు అజరామరం

అమరవీరుల కుటుంబాలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ● ఘనంగా నివాళి అర్పించిన మంత్రి స్వామి



మహిళకు బహుమతిని అందజేస్తున్న మంత్రి స్వామి

ఒంగోలు క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం అంకిత భావంతో పనిచేస్తున్న పోలీసుల సేవలు త్యాగనిరతికి తార్కాణం అని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి చెప్పారు. పోలీసు అమరవీరుల దినం సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలోని అమరవీరుల స్థూపం వద్ద మంగళవారం నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటోందన్నారు. విధినిర్వహణలో పోలీసులు చేస్తున్న త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు. జిల్లాలో గత ఏడాది 13 మంది మృతి చెందారని వారి కుటుంబాలకు ప్రతినిత్యం తమ సహకారం ఉంటుందని చెప్పారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ పోలీసుల త్యాగాల వెనుక నిస్వార్థాన్ని గుర్తించాలన్నారు. ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడి అశువులుబాసిన పోలీసు అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఎస్పీ వి.హర్షవర్ధనరాజు మాట్లాడుతూ దేశంలో గత ఏడాది 191 మంది పోలీసుల విధినిర్వహణలో అమరులు అయ్యారని అన్నారు. ఇటీవలే భారత ప్రభుత్వం నేషనల్ పోలీస్‌డేగా అక్టోబరు 21ని ప్రకటించిందని చెప్పారు. అదనపు ఎస్పీ కే నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు విజయకుమార్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, మేయర్ గంగాడ సుజాత, మాలకార్పొరేషన్ చైర్మన్ పి.విజయకుమార్, పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ కామేపల్లి సీతారామయ్య, రవాణాశాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల, డీఎస్పీలు, సీఐలు సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం జరిగే సమయంలో భారీ వర్షం వచ్చినప్పటికీ పోలీసు అమరవీరులకు ఘననివాళులు అర్పించారు.

కొండపిలో..

కొండపి: విధి నిర్వహణలో పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని సీఐ జి.సోమశేఖర్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అమరులైన వారికి సీఐ, పోలీసులు నివాళులర్పించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కొండపి, మర్రిపూడి, పొన్నలూరు ఎస్సైలు బి.ప్రేమ్‌కుమార్, అనూక్, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

చేకూరపాడు పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

మండల సమావేశంలో సర్పంచ్ రమేష్‌బాబు ధ్వజం ● పన్నుల నగదును ట్రెజరీకి జమ చేయలేదని వెల్లడి



సమావేశంలో ప్రశ్నిస్తున్న సర్పంచ్ రమేష్‌బాబు

నాగులుప్పలపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నులు వసూలు చేసి ట్రెజరీకి జమ చేయకుండా కాలయాపన చేస్తున్న చేకూరపాడు పంచాయతీ కార్యదర్శిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కొమ్మినేని రమేష్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం నాగులుప్పలపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్‌బాబు మాట్లాడుతూ చేకూరపాడు పంచాయతీ కార్యదర్శి సీహెచ్.పద్మావతి పనితీరు బాగాలేదన్నారు. పంచాయతీ పాలకవర్గానికి, కార్యదర్శికి మధ్య సఖ్యత లేక గ్రామంలో అభివృద్ధి కుంటుబడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రెండు నెలల క్రితం పంచాయతీలో ఇంటి పన్నులు రూ.30వేలు వసూలు చేసి వాటిని పంచాయతీ ఖాతాకు జమ చేయలేదని, తాను ప్రశ్నించగా సమాధానం లేదని వాపోయాడు. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, క్లాప్‌మిత్రలకు జీతాలు చెల్లించలేదని చెప్పారు. దాంతో కార్యదర్శి పద్మావతి, సర్పంచ్ రమేష్‌బాబు మధ్య పరస్పర ఆరోపణలు, మాటల యుద్ధం సాగింది. దీంతో ఎంపీపీ కలగజేసుకుని వివాదాలకు తావివ్వకుండా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సభ అనంతరం కార్యదర్శిని బదిలీ చేసి గ్రామాభివృద్ధికి పాటుపడే వారిని నియమించాలని సర్పంచ్ రమేష్‌బాబు ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. ఉప్పుగుండూరులో తాగునీరు, విద్యుత్, పారిశుధ్య సమస్యలు ఉన్నాయని, పాలకవర్గం పట్టించుకోవడం లేదని సమావేశం దృష్టికి రాగా ఎంపీడీవో రవికుమార్ స్పందించారు. గ్రామాలను స్వర్ణ పంచాయతీలుగా అభివృద్ధి చేసుకొనేందుకు ప్రభుత్వం మూడు అంచెల విధానం తీసుకువచ్చిందని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో పారిశుధ్య మెరుగుపరచుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దృష్టి సారించాలని సూచించారు. మొక్కలను విరివిగా నాటి పచ్చదనం పెంచాలని తెలిపారు. పలు శాఖల అధికారులు తమ నివేదికలను వివరించారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలి

● ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశం

నాగులుప్పలపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారుల పట్ల పోలీసు సిబ్బంది మర్యాదగా నడుచుకోవాలని ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశించారు. మంగళవారం నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను, స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులను క్షుణ్ణంగా విచారించి బాధితులకు నిర్దిష్ట సమయంలో న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యపానం చేసేవారిపై కేసులు నమోదు చేయాలన్నారు. కేసుల దర్యాప్తులో పోలీసు అధికారులు సిబ్బందిని భాగస్వామ్యం చేసి వారిలో నైపుణ్యాలను పెంపొందించాలని చెప్పారు. విజిబుల్ పోలీసింగ్‌ను గ్రామ స్థాయిలో విస్తృతం చేసి ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడి సమస్యలను స్వయంగా తెలుసుకోవాలని, వాటిని త్వరితగతిన పరిష్కరించి ప్రజల్లో పోలీస్‌శాఖకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీసు సిబ్బంది ఆరోపణలు వస్తే చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. ఆయన వెంట ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు, ఎస్ఐ రజియాసుల్తానా తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు పోలీస్‌స్టేషన్ తనిఖీ

మద్దిపాడు: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు మంగళవారం తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం స్టేషన్ ఆవరణాన్ని, గదులను, మహిళా సహాయక కేంద్రం, రిసెప్షన్ కౌంటర్, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అదేవిధంగా రికార్డులు, సీడీ ఫైల్స్‌ను ఆయన తనిఖీ చేశారు.

భారీ వర్షాలతో అప్రమత్తం

తీరంలో పర్యటించిన జిల్లా అధికారులు

వేట చేస్తుండగా పిడుగుపడి మత్స్యకారుడి పరిస్థితి విషమం



కొత్తపట్నం తీరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపట్నం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యింది. మంగళవారం జడ్పీ సీఈవో చిరంజీవి, డీపీవో ఎం.వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ నారాయణ కొత్తపట్నం తీరంలోని పలు గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. కొత్తపట్నంలో గ్రామంలోకి వచ్చిన నీటిని అధికారులు మోటార్లతో బయటకు పంపించారు. గ్రామాల్లోని తుఫాన్ షెల్టర్లను శుభ్రం చేయించారు. గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ అయ్యాయి. తుఫాన్ కారణంగా సముద్రం అల్లకల్లోలంగా ఉన్నప్పటికి కొంత మంది మత్స్యకారులు వేటకు పోతున్నారు. మంగళవారం గుండమాల తీరం వద్ద పిడుగు పడటంతో శింగోతు శ్రీనివాసులు అనే మత్స్యకారుడు ఆసుపత్రి పాలయ్యాడు. బోటు కూడా పాక్షికంగా దెబ్బతింది. పిడుగు పడి విద్యుత్ సరఫరా జరగటంతో బోటు మోటార్‌ను పట్టుకుని ఉన్న శ్రీనివాసులకు షాక్ తగడంతో పరిస్థితి విషమంగా ఉండటంతో ఒంగోలులోని ప్రయివేట్ వైద్యశాలకు తరలించారు. కె.పల్లెపాలెం ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించారు. ఈతముక్కల గ్రామంలో ఏర్పాటు చేసిన రిలీఫ్ కేంద్రాన్ని కూడా అధికారులు పరిశీలించారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: మండల ప్రత్యేకాధికారి ఎస్‌వెంకటేశ్వరరావు తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇంకొల్లు రోడ్డులో ఉన్న ఎస్టీకాలనీని పరిశీలించి వర్షపు నీరు నిల్వ లేకుండా ఉండేలా పక్కనే ఉన్న కాలువలోని పూడిక తీయించారు. అక్కడున్న వారికి భోజనం అందజేశారు. ఇబ్బంది తలెత్తితే కాలనీవాసులను జడ్పీ హైస్కూల్ పునరావాస కేంద్రానికి తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కొత్తకోటవాగు, చదలవాడ రామన్న చెరువును పరిశీలించి పలు సూచనలు చేశారు. తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో రవికుమార్ పాల్గొన్నారు.

ఉధృతంగా ముందిగొండి వాగు

ఒంగోలు(రూరల్): కొప్పోలు-కరవది రోడ్డులోని గుత్తికొండవారిపాలెం దగ్గర గల ముదిగొండి వాగు చప్టాపై వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. మంగళవారం రూరల్ తహసీల్దార్ నాయబ్‌రసూల్, ఎంపీడీవో రాజశేఖరరావు పరిశీలించారు. వీఆర్‌ఏలను కాపలా ఉంచారు. తీరప్రాంత గ్రామాలైన గుండాయపాలెం, చింతాయగారిపాలెంలో పర్యటించారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని చెప్పారు.

కార్పొరేషన్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఇందుకు సంబంధించి ఇంజనీరింగ్, శానిటేషన్ సిబ్బందిని అప్రమత్తం చేయడంతోపాటు ప్రధాన డ్రైయిన్లు పరిశుభ్రత చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అలాగే పోతురాజు కాలువ, నల్ల కాలువలో పూడికతీత పనులు చేపట్టి, నీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే వర్షం వల్ల ఇబ్బందులు ఎదురైతే కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబరు 08592-227766కు ఫోన్ చేయవచ్చని, 24 గంటలు సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు.

మహిళకు గాయాలు

మద్దిపాడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైకిల్ ఢీకొని మహిళకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. రోడ్డు దాటుతున్న అద్దంకి పట్టణం భవానీ సెంటర్‌కు వెంకటసుబ్బమ్మను మోటార్‌సైకిల్ వేగంగా వచ్చి ఢీకొన్నది. దీంతో ఆమెకు గాయాలు కాగా స్థానికుల సహాయంతో బస్సులో అద్దంకి వెళ్లారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మద్దిపాడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంటే అనేక రోగాలు దరిచేరవని డీపీవో ఎం.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ఏడుగుండ్లపాడులో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరుగా సేకరించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతి, సర్పంచ్ దాసరి శిల్పసౌందర్య, దాసరి రమేష్‌బాబు, గ్రామ కార్యదర్శి అజయ్‌కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్బీ కానిస్టేబుల్ ఇంటికి వెళ్లి..
వైసీపీ నాయకుడు కత్తితో బెదిరింపులు

అరెస్టు చేసిన పోలీసులు ● రిమాండ్ విధించిన కోర్టు

ఒంగోలు క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర పరిధిలోని పెళ్లూరులో నివాసం ఉంటున్న స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ ఎం.వెంకటరావు ఇంటికి వెళ్లిన వైసీపీ నాయకుడు కత్తితో బెదిరింపులకు దిగాడు. ఈ ఘటన సోమవారం జరిగింది. స్థానిక పెళ్లూరులో నివాసం ఉంటున్న వెంకటరావు ఇంటికి అదే గ్రామానికి చెందిన బొడ్డు జగన్ కత్తి తీసుకొని వెళ్లాడు. ఆ సమయంలో వెంకటరావు లేరు. ఆయన భార్య మాత్రమే ఉన్నారు. దీంతో జగన్ ఇంటి తలుపు నెట్టుకుంటూ లోపలికి వెళ్ళి మీ భర్తను చంపి ముక్కలుముక్కలుగా నరుకుతా అంటూ హెచ్చరించాడు. వినాయక చవితి సందర్భంగా జగన్‌ను పోలీస్‌స్టేషన్‌లో బైండోవర్ చేయాలంటూ వెంకటరావు సమాచారం ఇచ్చారని తెలుసుకుని కక్ష పెంచుకున్నాడు. అప్పటి నుంచి సమయం కోసం ఎదురుచూసిన జగన్ గుండాయిజానికి దిగాడు. ఇకడి నుంచి ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలంటూ హుకుం జారీ చేశాడు. దీంతో భయభ్రాంతులకు గురైన కానిస్టేబుల్ వెంకటరావు భార్య ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో వెంటనే ఆయన ఇంటికి వెళ్ళాడు. అయితే అప్పటికే అక్కడ నుంచి జగన్ పరారీ అయ్యాడు. ఈమేరకు ఒంగోలు తాలుకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి జగన్‌ను అరెస్టు చేసి మంగళవారం కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. అతడికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

పొగనారుమళ్లలో నీరు లేకుండా చూడాలి

ఒంగోలు(రూరల్), అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పొగాకు నారుమళ్లలో నీరు నిలువకుండా చూడాలని వేల నిర్వహణాధికారి జె.తులసి సూచించారు. మంగళవారం ఒంగోలు పొగాకువేలం కేంద్రం-2లో ఆమె మాట్లాడుతూ వర్షాలు ఎక్కువగా ఉండటంతో నారుమళ్లలో నీరు నిలిచే అవకాశం ఉంటుందని, దీంతో నారు దెబ్బతింటుందన్నారు. అందువల్ల వర్షపునీరు నిల్వలేకుండా బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వానల వల్ల నారుమళ్లు పసుపు రంగులోకి మారే అవకాశం ఉంటుందని, అలాంటి పరిస్థితుల్లో వర్షాలు తగ్గిన తరువాత రైతులు తమ సూచనల మేరు ఎరువులను వాడాలని సూచించారు.

గద్దలగుంటలో దారి దోపిడీ

ఒంగోలు క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం గద్దలగుంటలో దారిదోపిడీ జరిగింది. ఈ సంఘటన సోమవారం రాత్రి స్థానిక గద్దలగుంట మూడు బొమ్మల సెంటర్ వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే.. గాంధీనగర్‌కు చెందిన కామేపల్లి శేఖర్, తన తల్లి ఆసుపత్రిలో ఉండగా వెళ్ళి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈక్రమంలో గద్దలగుంటలో అతని బైక్‌ను అదే ప్రాంతానికి చెందిన సుదర్శి విజయ్ ఆపి రాడ్‌తో దాడి చేశాడు. శేఖర్ వద్ద ఉన్న రూ.6500 నగదును అపహరించాడు. ఈ ఘటనలో శేఖర్ గాయపడగా వెంటనే రిమ్స్‌కు వెళ్ళి చికిత్స చేయించుకుని అవుట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

16 మంది జూదరుల అరెస్ట్

జరుగుమల్లి (కొండపి), అక్టోబరు 21: జరుగుమల్లి మండలం తూమాడు గ్రామంలో నడుస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. 16 మంది జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద రూ.61,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు.

పెరిదేపి-ముప్పరాజుపాలెం మధ్య మరో నలుగురు..

కొండపి: మండలంలోని పెరిదేపి-ముప్పరాజుపాలెం గ్రామాల మధ్య పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేసి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద రూ.12,300 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ట్రంప్ దిష్టిబొమ్మ దహనం

కొండపి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు విధించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నరకాసురుడి కంటే దుర్మార్గుడని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కేజీ మస్తాన్ అన్నారు. మంగళవారం కొండపి, ముప్పరాజుపాలెం గ్రామాల్లో ఆయన వ్యసాయ కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ట్రంప్ దిష్టిబొమ్మను కూలీలతో కలిసి దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు అంగలకుర్తి మునీంద్ర, నాగేంద్రమ్మ, రమణమ్మ, సురేష్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చెంచుపాలెంలో వైద్య శిబిరం

పొన్నలూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలపాడు పంచాయతీ పరిధి చెంచుపాలెంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు, సిబ్బంది ఫీవర్ సర్వే చేశారు. వైద్యాధికారి రవికిరణ్, డిప్యూటీ ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, సీహెచ్‌వో భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి రవిబాబు, సురేష్, శ్రీనివాస్, సుజాత, ఎంఎల్‌హెచ్ ఉష పాల్గొన్నారు.

పంటల సాగును ప్రభుత్వం ప్రకటించాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో రైతులు ఎలాంటి పంటలు సాగు చేయాలో ప్రభుత్వం ప్రకటించాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో రైతు సంఘాల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ పాలకులు గత రెండేళ్ళుగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడంతో తక్కువ ధరలకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రెండేళ్ళుగా శనగకు ధరలు లేక కోల్డ్‌స్టోరేజీల్లోనే మగ్గుతున్నాయని చెప్పారు. రాజకీయాలు పక్కనపెట్టి రైతు సంక్షేమం కోసం అధికార, ప్రతిపక్షాలు కలిసి రావాలని కోరారు. సమావేశంలో రైతు సంఘాల ప్రతినిధులు పమిడి వెంకట్రావు, ఎస్.లలితకుమారి, చుంచు శేషయ్య, ఎంఎస్.సాయి పాల్గొన్నారు.

'మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దు'


నాగులుప్పలపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తుఫాను హెచ్చరికల నేపథ్యంలో మత్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లొద్దని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కనపర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని మేకలసోమయ్యపట్టపు పాలెం, చిన్నంగారి పట్టపుపాలెం, బీచ్‌పట్టపుపాలెం సముద్రతీర ప్రాంతంలో అలల ఉధృతిని పరిశీలించిన ఆయన ఆయా గ్రామాల మత్స్యకారులతో మాట్లాడారు. కనపర్తిలోని పునరావాసకేంద్రం జడ్పీ హైస్కూల్‌ను పరిశీలించారు. అనంతరం నాగులుప్పలపాడులోని పునరావాస కేంద్ర జడ్పీ హైస్కూల్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవోలు రవి, రమణయ్య, వీఆర్వోలు భాగ్యారావు, సుబ్బరామయ్య, భవాని ఉన్నారు.

చీమకుర్తి కమిషనర్‌కు ఉద్యోగోన్నతి

చీమకుర్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్యకు గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు కందిమళ్ల గంగాధరరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, పత్తి కోటయ్య, ఎస్.ఆంజనేయులు తదితరులు కమిషనర్‌ని కలిసి సత్కరించారు.

హరహర మహాదేవ

శంభో శంకర



నేటి నుంచి కార్తీకమాసం ప్రారంభం

నెలరోజులపాటు కళకళలాడనున్న శివాలయాలు

వివిధ సంఘాల ఆధ్వర్యంలో వనభోజనాలు

అయ్యప్ప మాలధారణలకూ ప్రాశస్త్యం

ఒంగోలు కల్చరల్, అక్టోబర్ 21(ఆంధ్రజ్యోతి) : పరమేశ్వరుని పూజించటానికి అత్యంత శ్రేష్ఠమైనదిగా కార్తీకమాసాన్ని భావిస్తారు. ఈ మాసం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. జిల్లాలోని పలు శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలతోపాటు వనభోజనాలతో పండుగ వాతావరణం నెలకొననుంది. ఏ మాసంలోనూ లేనివిధంగా ఈ కార్తీకమాసంలో స్నాన, దాన, ఉపవాస వ్రతాలు చేయటం, రోజూ మహిళలు కార్తీకదీపాలు వెలిగిస్తారు. ఈ ఏడాది కార్తీక మాసం ప్రారంభం విషయంలో ప్రజల్లో కొంత గందరగోళం నెలకొంది. సహజంగా దీపావళి మరుసటిరోజు నుంచి కార్తీకమాస ప్రారంభంగా భావిస్తారు. ఆ విధంగా మంగళవారం నుంచి కార్తీకమాసం ప్రారంభం కావాలి. తిథిద్వయం అంటే ఒకరోజులో రెండు తిథులు కలిసిరావటంతో ఈఏడాది కార్తీకమాసం బుధవారం నుంచి ప్రారంభమైంది. కార్తీకమాసంలో ఇటు శివాలయాలే కాకుండా అయ్యప్పస్వామి దేవాలయాలు సైతం మాలధారులతో కళకళలాడనున్నాయి. మాలధారణకు కార్తీకమాసం ఎంతో ప్రాముఖ్యమైనదికావడంతో వేలాదిమంది దీక్ష చేస్తారు.

ఒంగోలు నగరంలో ప్రత్యేకత..

ఒంగోలు నగరంలో కేశవస్వామిపేట శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, కొత్తపట్నం బస్టాండులోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, సంతపేట సాయిబాబా మందిరంలోని శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, లాయరుపేట సాయిబాబా మందిరం శ్రీ మరకతరామలింగేశ్వర స్వామి దేవస్థానం, అంజయ్యరోడ్డు శ్రీ పంచముఖ శివాలయం మొదలైన పలు ఆలయాలలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరగనున్నాయి. ఉమ్మడి జిల్లాలోని భైరవకోన, మడనూరు, మణికేశ్వరం, మార్కాపురం మొదలైన చోట్ల ఉన్న ప్రసిద్ధ శివాలయాలతోపాటు వివిధ పట్టణాలు, గ్రామాలలో ఉన్న శివాలయాలలో సైతం అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరుగనున్నాయి.

● పలు దేవాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

కార్తీకమాసంలో శివాలయాల్లో రద్దీ ఉంటుంది. ఈ నెలరోజులు అటు అభిషేకాలు నిర్వహించుకోవటానికి పురుషులు, సూర్యోదయం, సూర్యాస్తమయం సమయాల్లో కార్తీక దీపారాధనలకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఈ మాసంలో సోమవారానికి విశేష ప్రాధాన్యత ఉండడంతో భక్తుల రాక ఎక్కువగా ఉంటుంది. అదేవిధంగా కార్తీక పౌర్ణమి రోజున సముద్రస్నానానికి విశేష ప్రాధాన్యతనిచ్చి భక్తులు జిల్లాలోని పలు సముద్ర తీరాలలో స్నానాలను ఆచరిస్తారు. ఉమ్మడి జిల్లాలోని కొత్తపట్నం, కరేడు, పాకల, వాడరేవు ప్రాంతాల్లో ఆ రోజు భక్తులు వేలాదిగా స్నానాన్ని ఆచరిస్తారు. ఈ సందర్భంగా శివాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



విద్యుత్ దీపాలతో కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లోని శివాలయం

● వన భోజనాలకు అంతే ప్రాధాన్యత

ఏ మాసంలో లేని విధంగా కార్తీకమాసంలో వనభోజనాలకు విశేషమైన ప్రాధాన్యత ఉంది. కొన్నేళ్లుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో వివిధ కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, దేవాలయాల ఆధ్వర్యంలో వనభోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా వనభోజనాలు భక్తికే కాకుండా సమైక్యతకు కూడా చిహ్నంగా నిలుస్తాయి. అదేవిధంగా వన సమారాధన రోజు మహావిష్ణు స్వరూపమైన ఉసిరి చెట్టుకు, శ్రీ మహాలక్ష్మి స్వరూపమైన తులసిచెట్టుకు పూజచేయటం శివకేశ అభేదానికి గుర్తుగా నిలుస్తుంది.

● ఊపందుకోనున్న మాలధారణలు

కార్తీకమాసం వచ్చిందంటే అయ్యప్పస్వామి మాలధారులు ఎక్కువగా కనిపిస్తారు. ఈ మాసంలో ప్రారంభమయ్యే అయ్యప్పస్వాముల భక్తి సందడి సంక్రాంతి మకరజ్యోతి దర్శనం వరకు కొనసాగుతుంది. దాదాపు రెండున్నర నెలలపాటు అయ్యప్ప స్వామి దేవస్థానాలలో, వీధుల కూడళ్లలో ప్రత్యేకంగా పడిపూజ, భజన, భిక్ష వంటి కార్యక్రమాలు జరగనున్నాయి.

శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా వివిధ శైవక్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో జిల్లా నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు రీజనల్ మేనేజరు సత్యనారాయణ బుధవారం తెలిపారు. పవిత్ర కార్తీక సోమవారం ఒకే రోజున ఐదు ప్రముఖ శైవక్షేత్రాలైన అమరావతిలోని అమరరామం, భీవరంలోని సోమేశ్వరరామం, పాలకొల్లులోని క్షీరారామం, ద్రాక్షారామంలోని భీమేశ్వరరామం, సామర్లకోటలోని కుమారరామం క్షేత్రాలను దర్శించుకునేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఒంగోలు, గిద్దలూరు, కనిగిరి, నుంచి ప్రతి ఆదివారం బస్‌లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈనెల 26, నవంబరు 2, 9, 16వ తేదీలలో రాత్రి బయలుదేరి సోమవారం రోజున పంచరామాలు దర్శించుకుని తిరిగి మంగళవారం ఉదయం తిరిగి స్వస్థలానికి చేరతాయని వివరించారు. ఆయా డిపోలలో, ఆర్టీసీ ఏజెంట్ల వద్ద, ఆన్‌లైన్ ద్వారా టికెట్లు రిజర్వు చేసుకోవచ్చని తెలిపారు. ఒంగోలు నుంచి రూ.1800, మార్కాపురం నుంచి రూ.2100, గిద్దలూరు నుంచి రూ.2200, పొదిలి నుంచి రూ.1900, కనిగిరి నుంచి రూ.2000 చార్జీ వసూలు చేస్తామని వివరించారు. కార్తీక సోమవారం పంచారామాలను దర్శించుకునే అవకాశాన్ని ఆర్టీసీ కల్పిస్తున్న నేపథ్యంలో భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

25న ఒంగోలులో భారీ జాబ్ మేళా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన ఒంగోలులోని ఏకేవీకే డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ పీ రాజాబాబు తెలిపారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ నుంచి పీజీ వరకు ఉన్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివిధ కంపెనీల్లో వెయ్యికిపైగా ఉద్యోగ ఖాళీలు ఉన్నాయన్నారు. వేతనాలు రూ.11వేల నుంచి రూ.35వేల వరకు ఉండగా కొన్ని కంపెనీలు ప్రోత్సాహకాలు, ఇతర భత్యాలు కూడా అందిస్తాయని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జే రవితేజ పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో దీపావళి

ఒంగోలు కల్చరల్, అక్టోబర్ 21(ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగను జిల్లావ్యాప్తంగా ప్రజలు సోమవారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా టపాసులు కాలుస్తూ సందడి చేశారు. పండుగ సందర్భంగా సోమవారం ఉదయం పలు దేవాలయాలు కిక్కిరిసిపోయాయి. ఒంగోలు నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాలలో ఉదయం నుంచి అప్పుడప్పుడు జల్లులు పడినప్పటికీ మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు తెరిపి ఇవ్వటంతో బాణసంచా అమ్మకాలు కొనసాగాయి. ఆది, సోమవారాల్లో ఉదయం జల్లులతో టపాసులు ఎంతవరకు పేలుతాయి అనే సందేహంతో ప్రజలు అనుకున్న స్థాయిలో కొనుగోలు చేయలేదు. అయినప్పటికీ సోమవారం మధ్యాహ్నం నుంచి అమ్మకాలు ఊపందుకోవటంతో అమ్మకందారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇక సోమవారం రాత్రి వరకు నగరంలో బాణాసంచా పేలుళ్లతో సందడి నెలకొంది.

వేడుకల్లో కలెక్టర్ కుటుంబ సభ్యులు

ఒంగోలు కలెక్టరేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ పీ రాజాబాబు తన కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక కలెక్టర్ బంగ్లాలో సోమవారం రాత్రి కలెక్టర్ సతీమణి, కుమారుడు, కొడుకుతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. కలెక్టర్ తన కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచాను పేల్చారు.

రాలిన పండుటాకులు

ఒంగోలులోని వేరువేరు ప్రాంతాలలో ఇద్దరు వృద్ధురాళ్లు మృతి

ఒంగోలు క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) : వర్షాల కారణంగా ఇద్దరు యాచకులు మృతి చెందారు. నగరంలో వేరువేరు ప్రాంతాలలో యాచన చేసుకుంటూ బతికే వారు మంగళవారం మృతి చెందారు. స్థానిక కేశవరాజుకుంట వద్ద రేకుల షెడ్‌లో సుమారు 70 ఏళ్ల వయస్సు గల వృద్ధురాలు యాచన చేసుకుంటూ జీవిస్తుంది. చుట్టుపక్కల వారు ఆమెకు నిత్యం భోజనం పెడుతుంటారు. మంగళవారం రేకుల షెడ్‌లో నుంచి బయటకు రాలేదు. ఇరుగుపొరుగు వారు చూసే సరికి ఆమె మృతి చెందింది. అదే విధంగా నగరంలోని కర్నూలు రోడ్ ఫ్లైఓవర్ కింద భిక్షాటన చేసుకుంటూ ఉండే వృద్ధుడు మృతి చెందాడు. ఈమేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నల్లమల ఘాట్ రోడ్డులో ప్రమాదం

ఆర్టీసీ బస్సు - కారు ఢీ.. నలుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన కారు

పెద్ద దోర్నాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) :ఎదురెదురుగా ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు - కారు ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం శ్రీశైలం-దోర్నాల ఘాట్‌రోడ్డులో మండల పరిధిలోని చిన్నారుట్ల సమీపంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నూజివీడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శ్రీశైలం నుంచి దోర్నాల వైపు వస్తుండగా, బెంగళూరుకు చెందిన కారు దోర్నాల నుంచి శ్రీశైలం వైపు వెళ్తుండగా చిన్నారుట్ల మూలమలుపు వద్ద ఎదురుపడి ఢీకొన్నాయి. దీంతో కారు ముందుభాగం దెబ్బతింది. అందులో ఉన్న రవికుమార్, భాస్కర్, ప్రభావతి, తేజశ్విని గాయపడ్డారు. 108లో క్షతగాత్రులను సమీపంలోని సుండిపెంట వైద్యశాలకు తరలించారు. దోర్నాల పోలీసుస్టేషనుకు ఫిర్యాదు అందడంతో ఎస్సై మహేష్ సిబ్బందితో వెళ్లి పరిశీలించి, కేసు నమోదు చేశారు.

జిల్లాలో 8.7 మి.మీ. వర్షపాతం



ఒంగోలులోని కర్నూలు రోడ్డులో కురుస్తున్న వర్షం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తారు నుంచి మంచివర్షం కురిసింది. మంగళవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 8.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సీఎస్‌పురం 32.4, కంభం 21.4, పామూరు 18.6, ఒంగోలు అర్బన్ 17.8, ఒంగోలు రూరల్ 17.8, హనుమంతునిపాడు 17.0, రాచర్ల 16.6, బేస్తవారిపేట 16.2, కొత్తపట్నం 15.4, పొదిలి 13.8, పీసీపల్లి 13.4, కొమరోలు 10.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	250.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	260.00

పోలీసుల పనితీరుపై ఎస్పీ ఆగ్రహం

నాగులుప్పలపాడు, మద్దిపాడు పోలీసు స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు

ఫిర్యాదులు పట్టించుకోకపోవడంపై మండిపాటు



సూచనలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఒంగోలు క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారుల పనితీరుపై ఎస్పీ వి.హర్షవర్ధనరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆకస్మికంగా నాగులుప్పలపాడు, మద్దిపాడు పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు. ఆయా పోలీసు స్టేషన్లలో రికార్డులను పరిశీలించారు. పోలీసు అధికారుల పనితీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. నాగులుప్పలపాడులో ఇరువురు వృద్ధ దంపతులు ఇచ్చిన ఫిర్యాదును పట్టించుకోకపోవడాన్ని తీవ్రంగా పరిగణించారు. ఆ ఫిర్యాదును పట్టించుకోకపోవడంతో ఎన్ఆర్ఐ అయిన వృద్ధదంపతుల కుమారుడు కంప్లైంట్ డెస్క్‌లో పెట్టడంతో ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. అక్కడ్నుంచి వచ్చిన ఆదేశాల మేరకు పోలీసు యంత్రాంగం కదిలింది. ఇలాంటి ఫిర్యాదులు రావడం క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోకపోవడమే కదా అంటు సీరియస్ అయ్యారు. అంతేకాదు కులాంతర వివాహం చేసుకున్న యువతిని కిడ్నాప్ చేయడం, తదనతరం జరిగిన పరిణామాలను పోలీసు అధికారుల నుంచి ఎస్పీ వివరణ కోరారు. వారుచెప్పిన సమాధానానికి సంతృప్తి చెందకపోగా కేసు విచారణలో జరిగిన తప్పిదాలపై ఎస్పీ మండిపడ్డట్లు తెలిసింది. ఇలా అనేక కేసులు విషయాలలో జరిగిన పొరపాట్లను ఎత్తిచూపించినట్లు సమాచారం. అంతేకాకుండా ఆయా పోలీసు స్టేషన్లకు వెళ్లే సమయంలో సమగ్రమైన సమాచారం తీసుకున్న తరువాతనే తనిఖీలు చేస్తున్న ఎస్పీ అదేవిధంగా రెండు పోలీసు స్టేషన్లు తనిఖీలు చేశారు. తప్పిదాలకు బాధ్యులైన వారిపై చర్యలకు సమాయత్తం అవుతారా, మొదటి హెచ్చరికగా తీసుకుంటారా? అనేది చూడాల్సి ఉంది.

ఎస్సీ, ఎస్టీసబ్ ప్లాన్ నిధులను సమర్థంగా వినియోగించాలి

కలెక్టర్ రాజాబాబు ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఆ కార్యక్రమం అమలు వాస్తవ స్ఫూర్తితో వినియోగించాలని కలెక్టర్ పీ రాజాబాబు ఆదేశించారు, స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో మంగళవారం ఎస్సీ, ఎస్టీకాంపోనెంట్ ప్లాన్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాస్థాయిలో ఆయాశాఖల వారీగా ఖర్చు పెట్టిన విధానాన్ని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కొన్ని శాఖలు లక్ష్యాలకు దూరంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బలహీనవర్గాల అభివృద్ధి, వారి ఆవాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, జీవనోపాధి మెరుగుపర్చాలనే ఆశయంతో ప్రభుత్వం ఈ నిధులను కేటాయిస్తుందని తెలిపారు. అదే స్ఫూర్తితో ఆయా వర్గాలకు ప్రయోజనం కలిగేలా నిధులను ఖర్చు చేయాలన్నారు. వచ్చే సమావేశం నటికి నిధుల వినియోగంలో స్పష్టమైన మార్పు రావాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో గిరిజన సంక్షేమశాఖ అధికారి వరలక్ష్మీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్‌తో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.

లబ్ధిదారులకు యూనిట్ల పంపిణీకి ఆమోదం

జిల్లాలోని సముద్రతీర మత్స్యకారులకు పీఎంఎంఎస్‌వై పథకం ద్వారా ఎంపికైన చేసిన లబ్ధిదారులకు యూనిట్లు పంపిణీ చేయాలని జిల్లా స్థాయికమిటీ సమావేశంలో ఆమోదించారు. కలెక్టర్ రాజాబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. కొత్తపట్నం మండలం పల్లెపాలేనికి చెందిన మత్స్యకారులకు లైఫ్ జాకెట్స్, జీపీఎస్ సెట్స్, ఫస్ట్ ఎయిడ్ కిట్లు సరఫరా చేయాలని నిర్ణయించారు. సమావేశంలో జిల్లామత్స్యశాఖ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, జిల్లా అధికారులైన కమిటీ సభ్యులు బి. చిరంజీవి, ఎస్. శ్రీనివాసరావు, వరలక్ష్మీ, టి.నారాయణ, రమేష్, ఎల్‌డీఎం సుధాకర్, జిల్లామత్స్యసహకార సంఘం అధ్యక్షుడు పేరయ్య తదితరులు ఉన్నారు.

టి.కృష్ణ చిత్రాలు.. చైతన్య బావుటాలు

వర్థంతి కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి



టి.కృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నల్లూరి వెంకటేశ్వర్లు, ఇతరులు

ఒంగోలు కల్చరల్, అక్టోబర్ 21(ఆంధ్రజ్యోతి) : సంచలన దర్శకుడు టి.కృష్ణ నిర్మించిన చిత్రాలు సమాజంలో చైతన్యం నింపి అనేక సామాజిక సమస్యలను కళ్లకు కట్టినట్లు చూపాయని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు చెప్పారు. టి.కృష్ణ 39వ వర్ధంతి సభ మంగళవారం ఉదయం స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో జరిగింది. టి.కృష్ణ మెమోరియల్ కల్చరల్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు వి.సింగయ్య అధ్యక్షత వహించగా మురళి సభాహ్వానం పలికారు. కార్యక్రమంలో ముందుగా టి.కృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో నల్లూరి మాట్లాడుతూ టి.కృష్ణ కళాశాలలో చదివే రోజుల నుంచి ప్రజానాట్యమండలి కళాకారుడిగా అనేక నాటకాలలో నటించారన్నారు. ఆయన తీసినది కేవలం ఆరు చిత్రాలే అయినప్పటికీ ప్రతి ఒక్కటీ ఎంతో సందేశాత్మకంగా, సమాజంలోని సమస్యలకు దర్పణం పట్టేవిధంగా తీశారని చెప్పారు. వి.సింగయ్య, ఇండ్లమూరి రామయ్యలు మాట్లాడుతూ టి.కృష్ణతో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సర్దార్, కొత్తకోట వెంకటేశ్వర్లు, ఎం.సి.వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి ప్రకాశరావు పాల్గొన్నారు.

జిల్లాకు కేంద్ర ప్రభుత్వ అవార్డు

ఒంగోలు నగరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ధర్తీ ఆబ జన్‌భాగిదరి అభియాన్ పథకాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేస్తున్నందుకు అవార్డు దక్కింది. గిరిజన హక్కుల పరిరక్షణ, గృహ నిర్మాణం, ఇతర సంక్షేమ పథకాలను అందజేయటంలో విశేష కృషి చేసినందుకు ఈ నెల 17న కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డును జిల్లా అధికారులకు అందజేసింది. మంగళవారం కలెక్టర్ రాజాబాబు జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి వరలక్ష్మీ, జిల్లా గృహ నిర్మాణశాఖాధికారి పెరుగు శ్రీనివాస ప్రసాదును అభినందించారు.

నేటి నుంచి కార్తీక మాస పూజలు

గిద్దలూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకుసుమ హరనాథ క్షేత్రంలో ఈనెల 22 బుధవారం నుంచి నవంబరు 20వ తేదీ వరకు కార్తీక మాస పూజలు నిర్వహిస్తున్నట్లు శ్రీకుసుమ హరనాథ భక్త సంఘం అధ్యక్షుడు నటుకుల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి తుమ్మలపెంట శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 27, నవంబరు 1, 10, 15 తేదిలలో ఉభయదాతలకు సామూహిక అభిషేక కార్యక్రమాలు, నవంబరు 5న సామూహిక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, ఇదే రోజు సాయంత్రం జ్వాలాతోరణం, కోటి దీపార్చన, 17న శ్రీకుసుమ హరనాధుల లీలాకళ్యాణ మహోత్సవం, 17న కార్తీక వన సమారాధన, 18న గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలోని జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నుంచి కార్తీక మాసోత్సవం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ఈవో ఈదుల చెన్నకేశవ రెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 22 నుంచి నవంబరు 21 వరకు ఆలయంలో కార్తీక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబరు 25న నాగులచవితి, నవంబరు 5న జ్వాలతోరణం, కోటి దీపోత్సవం, ఈనెల 30న కోటి సోమవారంతో పాటు ప్రతి సోమవారం ప్రత్యేక పూజుల నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల నేపథ్యంలో ఆలయాల్లో ఏర్పాటు చేశారు.

పోలీసు అమరవీరులకు నివాళి


మార్కాపురం ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కందుల


గిద్దలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు


వైపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

» సేవలు మరువలేనివి
» ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజా రక్షణ కోసం అసువులుబాసిన పోలీసు అమర వీరుల త్యాగాలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా పట్టణంలో మంగళవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా ర్యాలీని సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్ ప్రారంభించారు. ర్యాలీ పోలీసు స్టేషన్ వద్ద ప్రారంభమై దోర్నాల బస్టాండ్, నాయుడువీధి, రథం బజార్, మెయిన్ బజార్ మీదుగా గడియారస్థంభం వరకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసుల సేవలు మరువలేనివన్నారు. నిరంతరం ప్రజల సంరక్షణ కోసం వారు పాటుపడుతుంటారన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు, సీఐ పి.సుబ్బారావు, ఎస్సైలు సైదు బాబు, అంకమ్మరావు, అహరోన్, ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, టీడీపీ వైద్య విభాగం రాష్ట్ర నాయకుడు డాక్టర్ షేక్ మౌళాలి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ మెక్షావలి, కనిగిరి రమణ, బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : అమరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులర్పించాలని గిద్దలూరు అర్బన్, రూరల్ సీఐలు కె.సురేష్, రామకోటయ్య అన్నారు. పోలీసు స్టేషన్ నుంచి కుమ్మరాం కట్ట, రైల్వేస్టేషన్, రాచర్లగేటు వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో గిద్దలూరు, రాచర్ల, కొమరోలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

త్రిపురాంతకం : అమరులైన పోలీసులకు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ అస్సాన్‌తో కురిచేడు, దొనకొండ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దారవీడు : విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని ఎస్సై సాంబశివయ్య అన్నారు. పోలీస్‌స్టేషన్ నుంచి దేవరాజు గట్టు వరకూ కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ అనిల్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పుల్లలచెరువు : శాంతి భద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో తమ ప్రాణాలు అర్పించిన పోలీసులకు పోలీసులు ఘనంగా నివాళులర్పించారు. ఎస్ఐ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో సంస్మరణ సభ అనంతరం బస్టాండ్ సెంటరులో మా నవహారం నిర్వహించారు.కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కంభం : శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా పలువురు పోలీసుల త్యాగాలు మరువలేనివని సీఐ మల్లికార్జున తెలిపారు. కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల ఎస్సైలు నరసింహారావు, రవీంద్రారెడ్డి, శివనాంచారయ్య, పోలీసు సిబ్బంది, పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసులతోపాటు తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో వీరభద్రాచారి పాల్గొన్నారు.

కొమరోలు : పోలీసు అమర వీరుల త్యాగాలు మురవలేమని ఎస్ఐ నాగరాజు అన్నారు. ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి పోలీసు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

ఎర్రగొండపాలెం : పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎస్ఐ పీ చౌడయ్య అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఎస్ఐ చౌడయ్య, పోలీసులు విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు.

పెద్ద దోర్నాల : పోలీస్ అమర వీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఎస్సై వీ మహేశ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి పోలీసులు నటరాజ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవ హారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బం ది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


గండి పడిన ఫీడర్ కెనాల్‌ను పరిశీలిస్తున్న ఎరిక్షన్‌బాబు

త్వరలో ఫీడర్ కెనాల్ పనులు ప్రారంభం

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టులోని కీలకభాగంమైన ఫీడర్ కెనాల్ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కొండప్రాంతాల్లోని వరదనీరు ఫీడర్ కెనాల్‌కు చేరి పటిష్టం లేక మండలంలోని కటకానిపల్లె సమీపంలో గండ్లు పడ్డాయి. దీంతో కెనాల్‌లోని నీరు పంటపొలాలపై ప్రవహించడంతో నీరు ఉరకెత్తుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎరిక్షన్‌బాబు సంబంధిత అధికారులతో కలిసి కెనాల్ వద్దకు వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆయన గ్రామ ప్రజలతో మాట్లాడుతూ కెనాల్ పటిష్టతకు ఇటీవలే ప్రభుత్వం రూ.450కోట్లు మంజూరు చేసిందని టెండరు దశలో ఉందన్నారు. త్వరలోనే తిరిగి పనులు ప్రారంభిస్తారని తెలిపారు. అప్పటి వరకు తాత్కాలిక మరమ్మత్తులు నిర్వహించనున్నట్లు చెప్పారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గత వైసీపీ నిర్వాహకం వల్లే ప్రాజెక్టు పనులు మంద గించాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాజెక్టు పట్ల ప్రత్యేక దృష్టి సారించారని, యుద్ధప్రాతిపదికన పనులు జరుగుతున్నాయని వచ్చే ఖరీఫ్ నాటికి కృష్ణా జలాలు ఈ నేలపై ప్రవహిస్తాయన్నారు. అలాగే దెబ్బతిన్న పంటలకు పరిహారం అందేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎరిక్షన్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో డీఈ చెర్రీ, తహసీల్దార్ అశోక్‌కుమార్ రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, కె సుబ్బారెడ్డి, ఎలకపాటి చంచయ్య, రావెళ్ల సత్య నారాయణ, ఎలకపాటి బాబు, దేవయ్య, షేక్ మౌలాలి పాల్గొన్నారు.

వాలీబాల్ జట్ల ఎంపిక


వాలీబాల్‌కు ఎంపికైన బాలబాలికలు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ అండర్-14, 17 బాలబాలికల ఎంపికలు మంగళవారం నిర్వహించారు. మండల స్థాయిలో ఎంపికైన 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారి మామవిళ్లపల్లి శ్రీనివాసులరెడ్డి, ఎంఈవోలు రామ్‌దాస్ నాయక్, శర్వాణి, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, డివిజన్ కోఆర్డినేటర్లు చంచయ్య నాయుడు, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన బాలికలు

త్రిపురాంతకం : విశ్వనాథపురం పాఠశాల నుంచి ముగ్గురు బాలికలు వాలీబాల్ పోటీల్లో డివిజన్ స్థాయి పోటీల్లో విజయం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ ఎం.కోటేశ్వరరావు తెలిపారు. మార్కాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్ 14 విభాగంలో వాలీబాల్ పోటీల్లో దార్ల అమూల్య, గోపిశెట్టి నందిని, గడ్డి నాగహర్షిని పాల్గొని విజేతలుగా నిలిచారని వారు ఒంగోలులో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

పెద్ద దోర్నాల : జిల్లా స్థాయి వాలీ బాల్ పోటీలకు దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని శ్యాంప్రసన్నతాంజలి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న మార్కాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో (బాలురు) డివిజన్ స్థాయి పోటీలు నిర్వహించగా దోర్నాల విద్యార్థులు అండర్-17 కేటగిరీలో, అండర్-14 విభాగంలో ఎంపికైనట్లు చెప్పారు. వీరంతా ఈ నెల 22వ తేదీన ప్రకాశం జిల్లా లోని కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామ పాఠశాలలో జిల్లా స్థాయ వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

పేద కుటుంబానికి సాయం

పుల్లలచెరువు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పుల్లలచెరువు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఓ కుటుంబానికి టీడీపీ మండల నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. మంగళవారం ఎస్సీ కాలనీకి చెందిన దోర్నడ్ల సత్యంకు పక్షవాతం వచ్చి కుటుంబం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకొని టీడీపీ పట్టణ అధ్యక్షుడు మేడికొండ అనిల్ చౌదరి రూ.5వేల సాయానిన అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, పట్టణాధ్యక్షుడు మేడికొండ అనిల్ చౌదరి, సర్పంచ్ బడిపాటి ఓబులు, కోలుకులూరి కుమార్ పాల్గొన్నారు.

రోగులకు వైద్య పరీక్షలు

ఎర్రగొండపాలెం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లమల అటవీ ప్రాంతమైన పాలుట్ల పీహెచ్ పరిధిలోని ఇస్టకామేశ్వరి దేవాలయ సమీపంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గిరిజన కుటుంబాలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. సోమ, మంగళవారంలో ఈ పరీక్షలు నిర్వహించినట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. వారికి అవసరమైన పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో డీ చంద్రమోహన్, ఎస్‌కేబాషా, విజయబాస్కర్, ఆశోఖ్ నాయక్, జానారెడ్డి, మాధవి, కొండయ్య, వెంకటరామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఖురాన్ కంఠస్థ పోటీల బ్యానర్ల ఆవిష్కరణ

గిద్దలూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బాలబాలికలకు దివ్యఖురాన్ కంఠస్థ ప్రతిభ పోటీల బ్యానర్లను, కరపత్రాలను యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్ ప్రతినిధులు ఆవిష్కరించారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో జిల్లా స్థాయిలో 3 ప్రదేశాలలో ఈ పోటీలను ఏర్పాటు చేసి డిసెంబరు 7వ తేదీన గిద్దలూరులో ప్రీ క్వార్టర్ ఫైనల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. వీరి నుంచి 24 మందిని క్వార్టర్ ఫైనల్స్‌కు ఎంపిక చేసి తరువాత మార్కాపురంలో జరిగే సెమీ ఫైనల్‌లో వారిలో ప్రతిభ చూపిన వారికి ఫిబ్రవరి 8న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫోరం కోఆర్డినేటర్ ఎస్.ఎ.ఖదీర్, ఇస్లామి హింద్ అధ్యక్షుడు ఫాజిల్ అహమ్మద్, ఇమామ్‌ల సంఘం అధ్యక్షుడు మౌలానాఅబ్దుల్‌హక్, కార్యదర్శి ఉస్మాన్, జెఐహెచ్ నాయకులు హబీబ్‌భాషా, ఎస్ఐవో అధ్యక్షుడు ఫయాజ్ హుస్సేన్ పాల్గొన్నారు.

చెరువుకట్ట అభివృద్ధి పనుల పరిశీలన

గిద్దలూరు టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవరాయునిపేట గ్రామపరిధిలో గల మొండికట్ట చెరువు తూము పంట కాలువల అభివృద్ధి పనులను మంగళవారం ఇరిగేషన్ డీఈ రామారావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరామిరెడ్డి పరిశీలించారు. ప్రభుత్వం ఈ చెరువు కట్ట తూము పనులకు రూ.5లక్షల నిధులు మంజూరు చేయగా మంజూరైన నిధుల పనులను అధికారులు పరిశీలించారు. పనుల నాణ్యతలో ఎటువంటి లోపాలు లేకుండా చేయాలని, ఈసందర్భంగా సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు.

పోలేరమ్మకు అమావాస్య పూజలు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం శివారులలోని పోలేరమ్మకు మంగళవారం అమావాస్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

» ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి
» 100 మందికి 54.50 లక్షల చెక్కుల పంపిణీ

గిద్దలూరు టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పేదలు ఆరోగ్యంగా ఉంటేనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆనందంగా ఉంటారని, ఆదిశగా ప్రభుత్వం పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని వందమంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.54,50,093 చెక్కుల రూపంలో అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడే వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక ఆపన్న హస్తమని, పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. పట్టణాలలోని కార్పొరేట్ ఆసుపత్రిలో పేదవారు నాణ్యమైన వైద్యం ప్రస్తుతం పొందవచ్చన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ అనేక మంది పేదలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి అండగా నిలబడాలన్నదే ధ్యేయమన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలోని 440 మంది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.4,64,97,216 అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో గిద్దలూరు, కంభం మార్కెట్‌యార్డు చైర్మన్లు బైలడుగు బాలయ్య, పూనూరు భూపాల్ రెడ్డి, కంభం, గిద్దలూరు సొసైటీ బ్యాంక్ చైర్మన్లు కేతం శ్రీనివాసులు, దుత్తా బాలీశ్వరయ్య, మండలపార్టీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. దివ్యాంగుడైన తురిమెళ్ల గ్రామానికి పీరావలికి అశోక్‌రెడ్డి వీల్‌చైర్‌ను అందచేశారు.

పేదల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

మార్కాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాలు, పేదల శ్రేయస్సే ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మి అన్నారు. పట్టణ, మండల పరిధిలోని 11 మందికి మంజూరైన సీఎమ్ఆర్ఎఫ్ చెక్కులను సోమవారం ఆమె ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. మొత్తం రూ.5.51 లక్షల మేర చెక్కులను ప్రైవేటు వైద్య చికిత్సలు పొందిన వారికి అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గుంటక కృష్ణవేణి, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు దొడ్డా రవణమ్మమ, పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీంఖాన్, కార్యదర్శి మేడిద రంగస్వామి, రాష్ట్ర రజక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కనిగిరి రమణ, జాబీర్‌హుసేన్‌బేగ్, ఎమ్.చెన్నారెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించండి

రాచర్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతగా తమ విధులు నిర్వహించాలని ఎంపీడీవో ఎస్ వెంకట రామిరెడ్డి, విద్యాశాఖ అధికారి వీ గిరిధరశర్మ అన్నారు. మండలంలోని చిన్నగానిపల్లి జేపిచెరువు గ్రామ సచివాలయాల వివరాలు వివిధ సర్వేలు, రిపోర్టులు, రికార్డుల నిర్వహణ హ్యాండ్ బుక్స్ సిలబస్, ఎఫ్ఏ-1, ఎఫ్ఏ -2 పరీక్షల వివరాల నిర్వహణ, ఆన్‌లైన్ నమోదు తదితర విషయాలను తెలుసుకుని, రికార్డులను పరిశీలించారు.

నూతన సాగు పద్ధతులపై కిసాన్ గోష్టి

గిద్దలూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదిమూర్తిపల్లి గ్రామంలో ఆత్మ సౌజన్యంతో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కిసాన్ గోష్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కృషి విజ్ఞాన్ కేంద్రం సీనియర్ సైంటిస్ట్ జి.ప్రసాదబాబు మాట్లాడుతూ నూతన వ్యవసాయ సాగు, శాస్త్రీయ పద్ధతులు, ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కె.రాజశ్రీ, వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి, విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, ఆత్మ, వ్యవసాయ సహాయకులు వాణి, భవాణి, శంకరమ్మ పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావంతో అప్రమత్తంగా ఉండాలి

» అధికారులకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సూచన
» ప్రజలు జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వరుస అల్పపీడనాలతో తుఫాన్‌ల ప్రభావం కారణంగా కురుస్తున్న వర్షాలతో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతూ ప్రజలకు జాగ్రత్తలు సూచించాలన్నారు. మంగళవారం సాయంత్రం తుఫాన్ ప్రభావంపై నియోజకవర్గంలోని రెవె న్యూ, పోలీసు, అధికారులతో ఎమ్మెల్యే టెలికాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈనెల 26వ తేదీ వరకు అల్పపీడనం ప్రభావం కారణంగా కురిసే వర్షాలతో అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. చెరువులు, కుంటలకు వర్షం నీరు భారీగా చేరుతుందని, తద్వారా వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, విద్యార్థులు, యువకులు ఈతకు వెళ్లకుండా తల్లిదండ్రులు చూడాలన్నారు. తుఫాన్ ప్రభావం కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు.

వెలిగొండ ప్రాజెక్టును గాలికి వదిలేసిన వైసీపీ

» వైపాలెం ఎమ్మెల్యేకి ముంపు గ్రామాలకు వెళ్లే ధైర్యముందా?
» ప్రశ్నించిన టీడీపీ నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పెద్దారవీడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధికారంలో ఉన్న గత ఐదేళ్లు వైలిగొండ ప్రాజెక్టును పట్టించుకోకుండా గాలికి వదిలేశారని టీడీపీ పెద్దారవీడు మండల కన్వీనర్ మెట్టు శ్రీనివాసులరెడ్డి అన్నారు. మార్కాపురం ప్రెస్ క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడారు. మెట్టు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులకు నష్ట పరిహారం ఇవ్వకుండా వైసీపీ పాలకులు మాటలతో మభ్యపెట్టారన్నారు. ఈ ఏడాది, వచ్చే ఏడాదంటూ కాలయాపనతో ప్రజలను మోసగించారన్నారు. వెలిగొండ ప్రాజెక్టును ఎన్నికల హామీ మేరకు పూర్తి చేసి వచ్చే ఏడాది నీళ్లిం చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తతంటే వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్‌కు నిర్వాసిత గ్రామాలలో పర్యటించే ధైర్యముందా? అని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు వైసీపీ నాయకుల మాదిరి కాసులకు కక్కుర్తి పడేందుకు సిద్ధంగా లేరని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి సుపరిపాలన అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి గొట్టం శ్రీనివాసులరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు చింతగుంట్ల రాజేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రగుంట్ల నాగేశ్వరరావు, రిటైర్డ్ వీఆర్వో చింతగుంట్ల సుబ్బరామిరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు జడ్డా రవి, టీఎన్‌టీయూసీ నాయకులు దొడ్డా తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

హిందూ దేవాలయాలకు రక్షణ కల్పించండి


ఎస్ఐకి వినతిపత్రం ఇస్తున్న హిందూ సంఘాల నాయకులు


పగులగొట్టి ఉన్న వినాయక స్వామి గుడి అరుగు

హిందూ సంఘాల ఫిర్యాదు

కంభం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కంభం పంచాయతీ పరిధిలోని వై.జంక్షన్ సమీపంలోని వరసిద్ధి వినాయక స్వామి, శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయాల ప్రాంగణాలలో ఉన్న అరుగును ఆదివారం ఎవవరూ లేని సమయంలో కంభంకు చెందిన కొంత మంది ఎస్సీలు గడ్డపారలు తెచ్చి దౌర్జన్యంగా పడగొట్టారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవలని దేవస్థాన కమిటీ వారు ఎస్సై నరసింహారావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ పెద్దలు సుబ్రహ్మణ్యం, సూపర్‌స్టార్ (చెరుకుపల్లి సుబ్రహ్మణ్యం) మాట్లాడుతూ కాకర్ల ప్రసాద్, ప్రవీణ్ కుమార్, జయరాజ్ ఇంకా పలువురు ఎస్సీలు దేవాలయం ప్రాంగణంలో అరుగును ధ్వంసం చేశారన్నారు. అడ్డుకోబోయిన వారిని బెదిరించడమేగాక అరుగునే కాదు అవసరమైన వినాయక గుడిని లేపేస్తామని హెచ్చరించినట్లు ఎస్సైకి ఫిర్యాదు చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకు ముందుగా హిందు సంఘాలు వై జంక్షన్ నుంచి కందులాపురం సెంటర్ వరకు ర్యాలీగా వచ్చి నిరసన తెలిపాయి. కార్యక్రమంలో హిందూ సంఘాలతోపాటు టీడీపీ, బీజేపీ నాయకులు, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కేసు నమోదు

ఈ విషయమై ఎస్ఐ నరసింహారావు విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ నాయకులు జయరాజ్, మరికొంతమంది దౌర్జన్యంగా ఆలయానికి చెందిన అరుగును పడగొట్టారని వారిపై చర్యలు తీసుకోవాలని విశ్వబ్రాహ్మణ సంఘం హిందూ సంఘాలు ఫిర్యాదు చేయడంతో వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

చెన్నయ్యకు దీపావళి నగరోత్సవం


చెన్నకేశవస్వామి నగరోత్సవం పాల్గొన్న ప్రజలు


వేణుగోపాలస్వామికి గ్రామోత్సవం

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసియున్న శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామికి దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు స్వామి, అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణుడి అలంకారంలో చెన్నకేశవుడు రుక్మిణి సత్యభామ సమేతుడై నాలుగు మాడవీధులలో నగరోత్సవంలో విహరించారు. 4 మాడ వీధులలో నరకాసురుని ప్రతిమలు ఏర్పాటు చేసి నరకాసుర వధ నిర్వహించారు. వీధులలో బాణసంచా కాల్చారు. ఇండ్ల వద్ద లక్ష్మీపూజ నిర్వహించి దీపావళి నిర్వహించారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

వైభవంగా వేణుగోపాలస్వామి గ్రామోత్సవం

తర్లుపాడు : దీపావళి పండుగను పురస్కరించుకొని శ్రీ రుక్మిణీ సత్యభామ వేణుగోపాలస్వామి ఉత్సవ మూర్తులకు వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కారంపూడి వెంకట రమణాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి సాయంత్రం స్వామి అమ్మవార్ల విగ్రహాలను రథంపైకి తీసుకొచ్చారు. అనంతరం తర్లుపాడు పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు వార్లు పోసి కాయకర్పూరాలు సమర్పించారు. ఉభయదాతలు బాసు పాపిరెడ్డి, ధర్మపత్ని లక్ష్మమ్మ, బాసు వెంకటేశ్వరరెడ్డి, ధర్మపత్ని కృష్ణవేణి, బాసు రమేష్ రెడ్డి, ధర్మపత్ని కృష్ణవేణిలు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు వంపిణీ చేశారు. గ్రామోత్సవం సందర్భంగా మహిళలు కోలాటం ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త జవ్వాజి విజయభాస్కర్‌రావు, భక్తులు పాల్గొన్నారు. అలాగే చెరువుకట్ట వద్ద ఉన్న పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లింగోజిపల్లె వారిచే కోలాటం ప్రదర్శన నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు

ముండ్లమూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులో మంగళవారం సర్పంచ్ మేదరమెట్ల నారాయణమ్మ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. రహదారుల పక్కన ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. ముండ్లమూరు నుంచి తమ్మలూరు వెళ్ళే ప్రధాన రహదారి పక్కన సమీపంలోని నివాస ప్రాంతాల వారు వ్యర్థపదార్థాలను పడవేస్తున్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శి పరమేశ్వరి సమీప నివాస ప్రాంత ప్రజలతో మాట్లాడారు. వ్యర్థపదార్థాలు రహదారుల పక్కన పడ వేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈక్రాప్ నమోదు చేయించుకోవాలి

ముండ్లమూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో పంటలు సాగుచేసిన రైతులు ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు అన్నారు. మంగళవారం మండలంలోని వేములలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలా, సొసైటీల ద్వారా యూరియాను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 30లోగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ తిప్పస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో భారీ వర్షం

ముండ్లమూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో సోమ, మంగళవారాల్లో భారీ వర్షం కురిసింది. పులిపాడు, పెదఉల్లగల్లు, కెల్లంపల్లి, ముండ్లమూరు, పసుపుగల్లు, వేముల, వేములబండ, చింతలపూడి, ఈదర, భీమవరం, పూరిమెట్ల, అగ్రహారం గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. శంకరాపురం, సింగనపాలెం, పెదరావిపాడు, తమ్మలూరు గ్రామాల్లో ఓమోస్తరు వర్షం కురిసింది.

ప్రమాదాలకు కారణమైన కార్లు గుర్తింపు

ముండ్లమూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు, పులిపాడు వద్ద ఈనెల 16న ప్రమాదానికి కారణమైన కార్లను ఎస్ఐ కె.కమలాకర్ గుర్తించారు. వేంపాడులో గండి కామలాకర్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పులిపాడు వద్ద కారు ఢీకొట్టడంతో పసుపుగల్లుకు చెందిన కోడిగం సాయి కుమార్, చొప్పరపు వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడి నరసరావుపేటలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ కార్లను సీసీ పుటేజ్‌ల ద్వారా వివరాలు సేకరించారు. వేంపాడు వద్ద ప్రమాదానికి కారణమైన కారు హైదరాబాద్‌కు చెందినదిగా, పులిపాడు వద్ద జరిగిన ఘటనకు దర్శికి చెందిన కారుగా గుర్తించారు.

పాఠశాలలకు ఫ్యాన్లు బహూకరణ

కురిచేడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు ఆధ్వర్యంలో మంగళవారం రెండు పాఠశాలలకు ఫ్యాన్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ప్రతిజ్ఞాపురి కాలనీ ప్రాథమిక పాఠశాలకు రెండు ఫ్యాన్లు, పొట్లపాడు మోడల్ ప్రాథమిక పాఠశాలకు వంద గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేబీ రామారావు, వీవీ రమణారావు, ఇందూరి వెంకటనరిసిరెడ్డి, షేక్ ఖాజారహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పీసీపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పీసీపల్లి మండల సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ అత్యాల జపన్య అధ్యక్షతన జరగుతుందని ఎంపీడీవో జీవీ కృష్ణారావు తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల ప్రగతితో పాటు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్ష జరుగుతుందన్నారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులతో పాటు అన్నిశాఖల అధికారులు, సర్పంచ్‌లు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

బాధితులకు ఆర్థికసాయం

పామూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సంస్థ తరుపున పలువురు బాధితులకు వైద్య అవసరాల కోసం మంగళవారం ఆర్థికసాయం చేశారు. స్థానిక దివ్యజ్ఞానం సమాజ భవనంలో ఐదుగురు బాధితులకు ఒక్కొక్కరికి రూ. 5 వేలు చొప్పున అందజేశారు. తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్‌బాషా, ముప్పరపు కృసమ్మ, పోకూరి మాధవి, షేక్ మస్తాన్‌బీ, షేక్ మహబూబ్ మస్తాన్‌లకు ఆర్థికసహాయం అందజేశారు. కార్యక్రమంలో కె.రామిరెడ్డి, బి.జయరామిరెడ్డి, వి. వెంకటేశ్వరరెడ్డి, టి.వెంకటేశ్వరరావు, ఎం.నారాయణయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.లక్షా 35వేలు

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానానికి ఆదివారం భక్తులు సమర్పించిన ఆదాయాన్ని లెక్కించగా రూ. 1,35,421 వచ్చినట్లు ఈవో నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.51,280, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.30,360, అన్నదాన పథకానికి రూ.40,249, పంచామృత అభిషేకానికి రూ.11.032 వచ్చినట్లు ఈవో తెలిపారు. శాశ్వత అన్నదాన పథకానికి సీఎస్‌పురం గ్రామానికి చెందిన గంటా శ్రీను రూ.20,116 అందజేశారు.

మహిళా సాధికారత దిశగా ముందడుగు

- కనిగిరిలో మంత్రి స్వామి, ఎమ్మెల్యే ఉగ్ర ఉచితంగా కుట్టుమిషన్ల పంపిణీ



మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో ప్రభుత్వం నుంచి కుట్టుమిషన్లు రాకపోయినా కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సొంత నిధులతో శిక్షణ పొందిన మహిళలకు ఉచితంగా అందించారు. మహిళా సాధికారత దిశగా ఎమ్మెల్యే ఉగ్ర ముందడుగువేసేందుకు ఇదే ఉదాహరణ అని రాష్ట్ర మంత్రి స్వామి కొనియాడారు. మంగళవారం కనిగిరిలో అమరావతి హాలులో జరిగిన కార్యక్రమంలో మంత్రి స్వామి పాల్గొని ఎమ్మెల్యే ఉగ్రతో కలిసి మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. గత ఏడాది నుంచి జనని చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న విషయాన్ని మంత్రి తెలుసుకున్నారు. గతంలో కుట్టుమిషన్లను ఉగ్ర అందించారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వమే ఈకార్యక్రమాన్ని చేపట్టింది. అయితే ఏడాది పాటు కుట్టుశిక్షణ ఇచ్చినా ప్రభుత్వం వివిధ కారణాలతో మహిళలకు మిషన్లు అందజేయలేదు. దీంతో డాక్టర్ ఉగ్ర తన ట్రస్ట్ ద్వారా కుట్టుమిషన్ల పంపిణీకి శ్రీకారం పలికారు. మంగళవారం మంత్రి స్వామి చేతుల మీదుగా 140 మందికి వాటిని అందజేశారు. దీపావళి కానుకగా మహిళలకు కుట్టుమిషన్లు అందజేసిన మంత్రి, అధికారులు ఉగ్రను కొనియాడారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ నియోజకవర్గంలో మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో స్వయం ఉపాధి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఉచితంగా మిషన్లు కూడా పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. అలాగే వృద్ధాప్యంలో ఉన్న వారికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయించడంతోపాటు ఉచిత వైద్యశిబిరాలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్‌తోపాటు అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పత్తి

- భారీగా తగ్గనున్న దిగుబడులు
- ఆందోళన చెందుతున్న రైతులు



వర్షాలకు దెబ్బతిన్న పత్తిపంట

దొనకొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు పత్తి పంటను దెబ్బ తీస్తోంది. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి సాగుచేసిన రైతులకు అకాల వర్షాలు నట్టేట ముంచాయి. మండలంలోని 25 గ్రామాల్లో 2500 హెక్టార్లల్లో పత్తి సాగు చేశారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలు కోలుకోలేని దెబ్బతీసింది. మరో వారం రోజుల్లో చేతికందే పత్తి పంట కళ్లముందే పగిలిన కాయలు వర్షానికి తడుస్తుండటంతో అన్నదాతలు తల్లడిల్లిపోతున్నారు. నష్టం ఏం లేదని వ్యవసాయాధికారులు అంటున్నా దిగుబడి తగ్గి, సగం ధర కూడా రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుక్కులు, విత్తనాలు, ఎరువులు, పురుగులు మందులు, ఇతర కూలీలతో కలిపి ఎకరానికి దాదాపు రూ.30 వేల వరకు ఖర్చయింది. కాయలు విచ్చుకునే సమయంలో కురుస్తున్న వర్షాలకు దూది తడిసి నల్లగా తయారై పనికి రాకుండా పోతుందునని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంతటితో వర్షాలు ఆగితే కొంతమేరైనా తమకు పంట దిగుబడులు దక్కుతాయని అంటున్నారు. వర్షాలు ఆగకపోతే పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నకిలీ విత్తనాలతో మోసపోయా

- రామసుబ్బారెడ్డి, నరసింహనాయునిపాలెం



రెండు ఎకరాల్లో పత్తి సాగుచేశా. నకిలీ విత్తనాలతో విత్తనం పుట్టుకతోనే గులాబి పురుగు ఆశించటంతో కాయలు కుళ్లిపోతున్నాయి. మరోవైపు వర్షాల కారణంగా నష్టాలు తప్పేలా లేవు. ఎకరాకు దాదాపు రూ.30 వేల వరకు ఖర్చయింది. ఏం చేయాలో అర్థంకావటం లేదు.

వర్షాలకు పంట కుళ్లిపోతుంది

- కటూరు గోపాల్, పెద్దన్నపాలెం



తమకున్న నాలుగు ఎకరాలతో పాటు మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశా. ఎకరాకు ఎనిమిది క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని ఆశించా. అకాల వర్షాలకు పత్తి తడిసి కుళ్లి పోయి చేతికొచ్చే పరిస్థితి కనిపించటం లేదు. ఇంతటితో వర్షం ఆగిపోతే పెట్టుబడులైనా దక్కుతాయి.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి



దర్శిలో పోలీసుల అమరవీరుల సంస్మరణదినం సందర్భంగా జరిగిన ర్యాలీ

దర్శి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, సీఐ వైరామారావు అన్నారు. వారి సేవలను నిరంతరం గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దర్శిలో మంగళవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక గడియారస్తంభం సెంటర్‌లో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి పోలీసు అమరవీరులకు జోహార్లు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం పోలీసులు రాత్రింబవళ్లు పనిచేయటమే కాక శాంతి భద్రతల పరిరక్షణలో అనేకమంది అమరులైన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం.మురళీ, పలు ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలల ఉపాధ్యాయులు, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పామూరులో ర్యాలీ చేస్తున్న పోలీసులు

పామూరులో..

పామూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీసుల త్యాగాలను మరువలేమని సీఐ ఎం.భీమానాయక్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల ఎస్ఐలు కిశోర్‌బాబు, వెంకటేశ్వర నాయక్, కృష్ణపావని, పోలీసులతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల, అక్షర కళా శాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజారక్షణే పోలీసులు ధ్యేయం

కనిగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సమాజ పరిరక్షణ, ప్రజారక్షణే ధ్యేయంగా ప్రతి పోలీసు తమ కర్తవ్యాలను నిర్వహిస్తారని సీఐ షేక్ ఖాజావలి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసు అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు నివాళులర్పించి వందనం చేశారు. ఈ సందర్భంగా సీఐ ఖాజావలి మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం విధి నిర్వహణలో భాగంగా కొన్ని సందర్భాల్లో పోలీసులు తమ ప్రాణాలను సైతం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రాణాలు పోయే సమయంలో కూడా ప్రజారక్షణ కోసం ఆలోచించేది పోలీసులేనని అన్నారు. విధి నిర్వహణలో తమ ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు ప్రజలు అండగా నిలవాలన్నారు. దేశరక్షణలో జవాను, సమాజంలోని ప్రజల రక్షణ కోసం పోలీసులు అనునిత్యం కృషి చేస్తారన్నారు. విపత్కర పరిస్థితిల్లో ప్రజలకు ప్రాణనష్టం వాటిల్లే సందర్భంలో తన ప్రాణాలను కూడా లెక్కచేయకుండా రక్షణ కవచంలా పోలీసులు మారతారన్నారు. తొలుత స్థానిక పోలీసు స్టేషన్ నుంచి పట్టణంలోని పురవీధుల్లో పోలీసులు మార్చ్‌ఫాస్ట్ చేస్తూ ప్రజలకు పోలీసు అమరవీరుల త్యాగాలపై అవగాహన కల్పించారు. అనంతరం చర్చి సెంటర్ వద్ద మానవహారం నిర్వహించి ప్రజల సమక్షంలో పోలీసు అమరవీరులకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. కార్యక్రమంలో కనిగిరి సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు టి.శ్రీరాం, మాధవరావు, కోటయ్య, ఏఎస్ఐ శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



కనిగిరి: చర్చి సెంటరులో పోలీసు అమరులకు మౌనం పాటిస్తున్న పోలీసులు

ప్రజారక్షణే ధ్యేయంగా విధులు నిర్వర్తించాలి

- డీఎస్పీ లక్ష్మీనారాయణ

దొనకొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసులు విధుల నిర్వహ ణలో ముందుండాలని దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని డీఎస్పీ లక్ష్మీనారాయణ ఆదేశించారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో త్రిపురాంతకం సీఐ అస్సాన్, ఎస్ఐ టి.త్యాగరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కేసుల వివరాలపై ఎస్ఐతో చర్చిస్తున్న దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

వెలిగండ్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమానికి ప్రజాప్రభుత్వం పెద్దపీట వేసిందని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. మంగళవారం కనిగిరి మండలం కంచర్లవారిపల్లి హైస్కూల్‌లో రూ.69 లక్షలతో నిర్మించిన ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి ప్రారంభించారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో ఎస్సీ-2 హాస్టల్ ఆధునికీకరణ పనులను ప్రారంభించారు.

ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాల్లో ఎవరూచేయని అభివృద్ధి కనిగిరిలో ఉగ్రనరసింహా రెడ్డి చేస్తున్నారని చెప్పారు. హాస్టళ్ల విద్యార్థులకు మంచి భోజనం అందిస్తున్నట్టు చెప్పారు. ప్రప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే కొత్త హాస్టళ్ల నిర్మాణానికి రూ.వంద కోట్లకుపైగా నిధులు కేటాయించినట్టు చెప్పారు. పేద విద్యార్థులు చదువుకునే వసతి గృహాల్లో నాణ్యమైన బియ్యం అందిస్తున్నామని మంత్రి డాక్టర్ స్వామి పేర్కొన్నారు.

కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఫీరోజ్, రూరల్ అధ్యక్షుడు కొండా కృష్ణారెడ్డి, యారవ శ్రీను, కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, ధనలక్ష్మి, శివకృష్ణ, కరణం అరుణ, తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ హాస్టల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే ఉగ్ర

రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి

కురిచేడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతచెందిన ఘటన సోమవారం ఉదయం కురిచేడు సమీపంలో చోటు చేసుకుంది. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం ఇస్తాపురం గ్రామానికి చెందిన యర్రగుంట్ల మహేష్ (35) మోటారుసైకిల్‌పై దర్శికి వస్తున్నాడు. ఈక్రమంలో కురిచేడు సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న చింత చెట్టును ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఎస్ఐ శివ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

అమెరికా ఆధిపత్యాన్ని ప్రతిఘటించాలి

ముండ్లమూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన వాణిజ్య యుద్ధం నుంచి భారత వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను కాపాడుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. అమెరికా ఆధిపత్యాన్ని ప్రతిఘటించాలని పిలుపు నిచ్చారు.

మంగళవారం మండలంలోని ఉల్లగల్లు, వేంపాడు, శంకరాపురం, మారెళ్ళ, జమ్మలమడుగు గ్రామాల్లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చిత్రపటాలను దహనం చేశారు. ఈసందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగిస్తున్న ట్రంప్ టారీఫ్ విధా నాన్ని మోదీ ప్రభుత్వం వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెల్లంపల్లి ఆంజనేయులు, పంట ఏడుకొండలు, బోడపాటి హనుమంత రావు, గంగినేని సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి: భారత్‌పై అమెరికా విధిస్తున్న 50శాతం సుంకాలను వ్యతిరేకిస్తూ మంగళవారం పీసీపల్లిలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు, బడుగు జనార్దన్, యాకోబు, రాజు, ఏసయ్య, నారపరెడ్డి మాల కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

దేవస్థాన భూముల్లో రోడ్డు నిర్మాణం



అనుమతులు లేకుండా వేస్తున్న మట్టిరోడ్డు

పామూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలోని విరాట్‌నగర్ వద్ద దేవస్థానాలకు చెందిన భూముల్లో అనుమతులు లేకుండా మట్టి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. శ్రీవల్లీ భుజంగేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన 2.16 సెంట్ల భూమిలో మట్టి రోడ్డు పనులు చేపట్టారు. ఈవిషయంపై ఈవోను ప్రశ్నించంగా, దేవస్థానానికి చెందిన భూముల్లో విద్యుత్, నీరు, రోడ్ల తదితర పనులకు పంచాయతీ ఎటువంటి అనుమతులు చేయవద్దని గతంలోనే కోరామని తెలిపారు. అయినా పట్టించుకోకుండా దేవస్థాన భూముల్లో మట్టి రోడ్ల నిర్మాణ పనులు జరుగుతూనే ఉన్నాయన్నారు.

పొదుపు సంఘాల్లో అక్రమాల నివారణకు చర్యలు



మాట్లాడుతున్న ఏపీఎం ఆదిశేషు

తాళ్లూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత పెంచి అక్రమాలు అడ్డుకట్ట వేసేందుకు మనడబ్బులు- మన లెక్కలు కార్యక్రమం చేపట్టినట్టు ఏపీఎం డి.ఆదిశేషు అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మనడబ్బులు- మన లెక్కల కార్యక్రమంపై జరిగిన అవగాహన సదస్సులో అయన మాట్లాడారు. డ్వాక్రా మహిళల కోసం ప్రవేశపెట్టిన ఏఐ ఆధారిత మొబైల్ యాప్ ద్వారా ఆర్థిక లావాదేవీలను సులభతరంగా చేసుకోవచ్చునని చెప్పారు.

బ్యాంక్ లావాదేవీల్లో పారదర్శకతను పెంచి అక్రమాలకు అడ్డుకట్ట చేయవచ్చునని ఆదిశేషు పేర్కొన్నారు. వీవోఏలు బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. పొదుపు గ్రూపుల సమావేశాలను క్రమంతప్పకుండా నిర్వహించాలన్నారు. గ్రూపుల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎం.సుజాత, ఏపీఎం దేవరాజ్, సీసీలు మోహన్, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక మరమ్మతులతో తీరిన ఇబ్బందులు

తాళ్లూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎంతో కాలంగా మురుగునీటితో ప్రజలు, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు తీరాయి. తాళ్లూరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మురుగునీటిని చిప్స్‌తో పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. తాళ్లూరు- రజానగరం రోడ్డు మార్గంలో ఏబీసీ పబ్లిక్ సమీపాన వర్షపు నీరు నిల్వఉంటూ రాక పోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డు చిన్నపాటి చెరువును తలపిస్తుంది. ఈమార్గంలో రెండు పాఠశాలలు ఉన్నాయి. దీంతో విద్యార్థులు ఆమార్గంలో వెళ్లేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. ఈమార్గంలో మురుగుకాల్వలు లేకపోవటమే ప్రధాన సమస్యగా వుంది. ఇటీవల ఈమార్గం గుండా వెళ్లిన ఎంపీడీవో పి.అజిత మురుగు నీరు నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి షేక్ షహనాజ్‌బేగంను ఆదేశించారు. దీంతో సర్పంచ్ చార్లెస్ సర్జన్, గ్రామకార్యదర్శి ఆప్రాంతాన్ని పరిశీలించారు. మురుగు కాలువలు నిర్మించేందుకు నిధుల కొరతగా ఉండటంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. దీంతో ఆప్రాంత ప్రజల ఇబ్బందులు తొలగిపోయాయి.

మోడల్‌స్కూల్ ఆకస్మిక తనిఖీ

కనిగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థుల ప్రగతే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం కృషి చేస్తుందని సాంఘికసంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. పట్టణ సమీపంలోని మోడల్‌స్కూల్‌ను మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితో కలసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హాస్టళ్ళ అభివృద్ధి, పాఠశాలల్లో మధ్యాహ్నం డొక్క సీతమ్మ మధ్యాహ్నభోజన పథకం వంటి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా హాస్టళ్ళలో, పాఠశాలల్లో విద్యార్థుల మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించినట్టు చెప్పారు. పాఠశాలల్లో లాబోరేటరీలను ఏర్పాటుచేసి విద్యార్థుల మేథో సంపత్తిని పెంపొందించటం జరుగుతుందన్నారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు ఏమైనా ఉన్నాయా అని మోడల్‌స్కూల్ విద్యార్థినులను మంత్రి స్వామి అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం, కూరలు పెడుతున్నారా అని విద్యార్థినులు ప్రశ్నించారు. ఎమ్మెల్యే చొరవతో మోడల్ స్కూల్‌కు రోడ్డు, మౌలిక వసతులు ఏర్పాటయ్యాయని చెప్పటంతో మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం హాస్టల్‌లోని విద్యార్థినుల గదులు, వంటగదిలోని సామగ్రిని పరిశీలించారు.





కుటుంబ సమేతంగా బాణసంచా కాలుస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

హెల్త్.. వెల్త్.. హ్యాపీనే లక్ష్యం

పోలీసుల గౌరవం పెంచుతాను

- పోలీసులది ఉద్యోగం కాదు నిస్వార్థ సేవ
- అమరవీరుల సంస్మరణ దినంలో సీఎం చంద్రబాబు
- మంగళగిరి బెటాలియన్‌లో అట్టహాసంగా కార్యక్రమాలు

మంగళగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హెల్త్, వెల్త్, హ్యాపీనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మంగళగిరిలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ గ్రౌండులో మంగళవారం అట్టహాసంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా తొలుత ముఖ్యమంత్రి పోలీసు మృతవీరుల స్మారక స్థూపానికి నివాళులను అర్పించారు. ఆ తర్వాత పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరించి, అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని హోంమంత్రి వంగలపూడి అనిత, రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీష్‌కుమార్, శాంతిభద్రతల విభాగం అడిషనల్ డీజీ మధుసూదనరెడ్డిలతో ముఖ్యమంత్రి కలిసి సందర్శించారు. బెటాలియన్‌కు వచ్చిన సీఎం చంద్రబాబుకు కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ఎస్పీ వకుల్‌జిందాల్, బెటాలియన్ కమాండెంట్ నగేష్‌బాబు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో పోలీసులను ఉద్దేశించి సీఎం ప్రసంగిస్తూ ప్రజల రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న పోలీసులంటే తనకెప్పుడు గౌరవమేనని చెప్పారు. పోలీసుల గౌరవాన్ని పెంచడంతోపాటు వారి కుటుంబాల సంక్షేమ బాధ్యతలను తమ ప్రభుత్వం చూసుకుంటుందన్నారు. పోలీసుల త్యాగాలను, బలి దానాలను జాతి గుర్తుంచుకుంటూ వారి నుంచి స్ఫూర్తిని పొందుతుందని చెప్పారు. పోలీసులు చేసేది ఉద్యోగం అనేకన్నా నిస్వార్థ సేవ అనడం సరైనదని చంద్రబాబు చెప్పారు. ఏపీ పోలీసు అంటే ఓ బ్రాండ్ అని, దానికి మరింత వన్నె తెచ్చేలా పనిచేయాలని కోరారు. ప్రస్తుత తరుణంలో పోలీసు వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలన్నారు. సామాజిక సేవలో మానవత్వాన్ని చూపుతూనే అక్రమార్కులు, తప్పుడుపనులు చేసేవారి విషయంలో పోలీసు అంటేనే భయం కలిగేలా కఠినంగా వ్యవహరించాలని సీఎం సూచించారు. సైబర్ నేరాలకు పాల్పడాలంటే భయపడేలా పోలీసులు సాంకేతికతలో అప్‌డేట్ అవుతుండాలన్నారు.



అమర వీరులకు నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు

పోలీసు త్యాగాలను స్మరించుకోవాలి

అమరవీరుల సంస్మరణ దినంలో కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. బాపట్ల పట్టణ పోలీసుస్టేషన్ ప్రాంగణంలో మంగళవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రసంగించారు. పోలీసు అమరవీరుల ధైర్యం, త్యాగం, కర్తవ్య నిబద్ధత వల్లే సమాజం శాంతిభద్రతలతో జీవిస్తుందన్నారు. ప్రజలు చట్టాన్ని గౌరవిస్తూ పోలీసులతో సహకరిస్తే సమాజం మరింత సురక్షితంగా ఉంటుందన్నారు. పోలీసుశాఖ దేశ అంతర్గత భద్రతకు మూలస్థంభమన్నారు. ప్రజాస్వామ్యానికి పోలీసులు రక్షకులని తెలిపారు. రాత్రి పగలు అన్న తేడా లేకుండా నిరంతం అప్రమత్తంగా ఉంటూ సమాజం సజావుగా నడవటానికి పోలీసులు కృషి చేస్తారని చెప్పారు. చట్టాల అమల్లో కాదని ప్రజల్లో నమ్మకాన్ని బలోపేతం చేసుకోవడంలోనే పోలీసింగ్ ఉందన్నారు. అమరులైన పోలీసు కుటుంబ సభ్యులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. అంతకముందు స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, డీఎస్పీలు జి.రామాంజనేయులు, శ్రీనివాసరావు, ఎండీ మొయిన్, ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ సలీమా పాల్గొన్నారు.



బాపట్ల : అమరవీరుల కుటుంబాలను సత్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్

దీపావళి.. ఆనందకేళి



- వెలుగులతో నిండిన పండుగ
- టపాకాయలు కాల్చి చిన్నాపెద్ద సంబరం

(బాపట్ల, రేపల్లె, చీరాల, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో సోమవారం దీపావళి పండుగను ప్రజలు అట్టహాసంగా జరుపుకున్నారు. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా దీపావళిని ఓ వేడుకగా నిర్వహించుకున్నారు. మహిళలు దీపాలు, పూలతో సుందరంగా అలంకరించగా లోగిళ్ల వెలుగులు విరజిమ్మాయి. చిన్నారులు ఉదయం నుంచే టపాకాయలు కాలుస్తూ సందడి చేశారు. రంగు రంగుల బాణసంచా వెలుగులతో పట్టణాలు, పల్లెలు నిండిపోయాయి. బాణసంచా వెలుగులు కనువిందు చేశాయి. జిల్లా అంతటా దీపావళి శోభ సంతరించుకుంది. టపాసుల మోతలతో వీధులు హోరెత్తిపోయాయి. చిన్న పెద్ద తారతమ్యం లేకుండా అందరూ టపాకాయలు పేలుస్తూ ఆనందంలో మునిగితేలారు. దీపావళి సందర్భంగా ఇంటింటా.. వ్యాపార సంస్థల్లో లక్ష్మీ పూజలు ఘనంగా జరిగాయి. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గృహాలు, వ్యాపార సంస్థలు రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. జిల్లాలో ఎక్కడా ప్రమాద ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, ఆనందోత్సాహాల నడుమ దీపావళి పర్వదినం ముగిసింది.



విద్యుత్ వెలుగుల్లో ఆలయ గోపురం

నేటి నుంచి కార్తీక మాసం

అమరేశ్వరాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు

అమరావతి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బుధవారం నుంచి ప్రారంభం కానున్న కార్తీకమాసం పురస్కరించుకుని ప్రథమ ఆరామమైన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నదీతీరం, ఆలయ ప్రాంగణంలో కార్తీకదీపాలను వెలిగించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలిరానున్నారు. ఈ క్రమంలో భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. క్యూలను ఏర్పాటు చేసి ఎండ నుంచి రక్షణకు ఆలయ ప్రాంగణంలో షామియానాలు ఏర్పాటు చేశారు. స్నానఘాట్ వద్ద మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలికంగా షెడ్లు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన గాలిగోపురంతో పాటు ఉపాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

నేలవాలిన వరి

వేమూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రైతులు వణికిపోతున్నారు. ఈదురుగాలులకు ఇప్పటికే పలు ప్రాంతాల్లో కోతకు వచ్చిన వరిపైరు నేలవాలింది. వేమూరు మండల పరిధిలో మంగళవారం సాయంత్రం ఓ మోస్తరుగా వర్షం పడింది. దీంతో కోతకు సిద్ధమైన, పొట్ట దశలో ఉన్న, పాలు పోసుకుంటున్న దశలోని పైర్లు పడిపోయాయి.



చంపాడు వద్ద నేలకొరిగిన వరిపైర్లు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు సుగుణమణి

త్రోబాల్ జట్టులో యాజలి విద్యార్థులు

1 24 నుంచి అహ్మదాబాద్‌లో జాతీయ స్థాయి పోటీలు

కర్లపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఈ నెల 24 నుంచి 26 వరకు అహ్మదాబాద్‌లో జరిగే జూనియర్ త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలకు యాజలి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు సుగుణమణి తెలిపారు. పాఠశాలకు చెందిన కె.తిరుపతమ్మ, ఏ.హాసిని, కె.శ్రీవల్లి, డి.దినేష్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారన్నారు. వీరిని మంగళవారం విద్యాకమిటీ చైర్మన్ ఎస్.వెంకటేశ్వర్లు, పీడీ మెర్సీ తదితరులు అభినందించారన్నారు.

12 ఏళ్లకు కొత్తపేటలో ఎన్నికల సందడి

1 రేపటి నుంచి నామినేషన్లు, వచ్చే నెల 3న ఎన్నికలు

చీరాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీ ఎన్నికలకు అధికారులు ముహూర్తం ఖరారు చేశారు. ఇందుకు సంబంధించిన ఆదేశాలను మంగళవారం విడుదల చేశారు. ఈ నెల 23 నుంచి మొదలై 25తో నామినేషన్ల ప్రక్రియ ముగుస్తుంది. 26న స్క్రూట్నీ, అప్పీలు అవకాశం కల్పించారు. 29 మధ్యాహ్నం నుంచి పోటీలోని అభ్యర్థుల జాబితాను విడుదల చేయనున్నారు. అనంతరం నవంబరు 3న



కొత్తపేట పంచాయతీ కార్యాలయం

ఉదయం 7 గంటల ఓటింగ్, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు విడుదల చేయనున్నారు. షెడ్యూల్ ప్రకటనతో గ్రామంలో ఎన్నికల కోలాహలం మొదలైంది. గ్రామంలో సుమారు 11 వేలకు పైగా ఓటర్లు ఉండగా 16 వార్డులు ఉన్నాయి. గ్రామంలో 2013లో ఎన్నికలు జరిగాయి. అనంతరం 2018లో ఎన్నికలు జరగాల్సి ఉండగా కొన్ని అనివార్య కారణాలతో ఎన్నికల ప్రక్రియ వాయిదా పడింది. 2019లో అప్పటి ప్రభుత్వం బైఫర్‌కేషన్ ప్రక్రియ చేపట్టింది. ఈ క్రమంలో పట్టణానికి సమీపంలో ఉండే కొత్తపేటలోని ప్రసాద్‌నగర్‌లో కొంత భాగం, రోశయ్య కాలనీ, ప్రతిభ భారతినగర్, వడ్డె సంఘం ప్రాంతాలు సుదూర ప్రాంతమైన పాపాయిపాలెంలో కలిపారు. భౌగోళికంగా వాడరేవు పంచాయతీలో ఉన్న కీర్తివారిపాలేన్ని సుమారు 5 కిలోమీటర్లు దూరంలో ఉన్న బుర్లవారిపాలెంలో కలిపారు. ఈ ప్రకారం 2020లో ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ కూడా జారీ చేయగా కీర్తివారిపాలెం పీడీసీసీ బ్యాంకు మాజీ డైరక్టర్ గడ్డం శ్రీనివాసరావు, కొత్తపేట మాజీ సర్పంచ్ చుండూరి వాసు వేర్వేరుగా కోర్టుకు వెళ్లడంతో ఎన్నికలు నిలిచాయి.వేటపాలెం మండలం రామన్నపేటపై బైఫర్‌కేషన్ ఇబ్బందులు లేకపోవడంతో ఆ పంచాయతీలో మాత్రం ఎన్నికలు జరిగాయి. నాలుగు నెలలకే కోర్టు తీర్పు ఇచ్చినా పాత పద్ధతిలో గ్రామాల్లో ఎన్నికలు జరగలేదు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వంలో తాజా నోటిఫికేషన్‌తో గ్రామంలో 12 ఏళ్ల తరువాత ఎన్నికల సందడి నెలకుంది.

ఇప్పటికే రూ.100 కోట్లు నష్టం

2013 తర్వాత నుంచి పంచాయతీ ఎన్నికలు జరగక పోవడంతో నియోజకవర్గంలోని మేజర్, చిన్న పంచాయతీలకు రావాల్సిన సుమారు రూ.100 కోట్లు నిధులు కోల్పోయాయి. కాలక్రమేణ నిధులు కొరతతో తాగునీటి వసతులతో సహా అన్నిరకాల మౌలిక వసతులు సైతం కనుమరుగయ్యాయి. రహదారులు సరి లేవు. విద్యుత్ దీపాల వెలుగులు లేవు. చిన్న గ్రామాల్లో అయితే పరిస్థితులు మరీ దారుణంగా మారాయి.

నిర్లక్ష్యం నోటీసులు

- పింఛన్ల పంపిణీలో అలసత్వంపై చర్యలు
- సచివాలయ ఉద్యోగులపై ప్రభుత్వం కన్నెర్ర
- మూడు జిల్లాల్లో 153 మందికి షోకాజ్ నోటీసులు

బాపట్ల, అక్టోబరు 21 (ఆంధ్ర జ్యోతి): ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ల పంపిణీని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. ఒకటో తేదీన ఉదయాన్నే, ఆ రోజు సెలవు అయితే ముందు రోజునే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్ మొత్తం అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ పంపిణీ బాధ్యత సచివాలయ ఉద్యోగులది. అయితే కొందరు ఉద్యోగులు ఇది తమ పని కాదని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. అధికారులు ఎన్నిసార్లు హెచ్చరికలు జారీ చేసినా పలువురు పట్టించుకోకుండా తమ ధోరణిని వీడటంలేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం విధుల్లో నిర్లక్ష్యంపై కన్నెర్ర చేసింది. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై చర్యలకు సిద్ధమైంది. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల రాష్ట్ర డైరెక్టర్ నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. ఈ నెల 1న ఉదయం 7 గంటలకు పెన్షన్ పంపిణీ ప్రక్రియను ప్రారంభించని వారితో పాటు, లబ్ధిదారులను కార్యాలయానికి పిలిపించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ లెక్కన గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాలకు సంబంధించి 153 మంది ఉద్యోగులపై చర్యలకు రంగం సిద్ధం చేశారు.



బహిష్కరించామని చెప్పారు..

తమ డిమాండ్ల పరిష్కారం కోసం సచివాలయ ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే పెన్షన్స్ పంపిణీ కార్యక్రమం మాత్రం యథావిధిగా నిర్వహించాలని నిర్ణయించారు. కొన్ని ఉద్యోగ సంఘాలు మాత్రం పెన్షన్లు పంపిణీ నిలుపుదల చేస్తే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావచ్చని చెప్పింది. ఈ సంఘాల నేతల ఉచ్చులో కొందరు సచివాలయ ఉద్యోగులు చిక్కుకున్నారు. పింఛన్ల పంపిణీ సాఫీగా జరగాలని అధికారులు హెచ్చరిక జారీ చేసినా పట్టించుకోలేదు. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం సహా పలు ప్రాంతాల్లో కార్యాలయం వద్దకు వచ్చి పెన్షన్లు తీసుకోవాలని మైకుల్లో ప్రచారం చేయించారు. ఇలాంటి వ్యవహారాలు ప్రభుత్వం దృష్టికి వెళ్లాయి. దీంతో బాధ్యులైన ఉద్యోగులపై చర్యలకు ఆదేశించింది.

బాపట్ల జిల్లాలో 17 మందికి

అక్టోబరు నెలకు సంబంధించి పెన్షన్ల కార్యక్రమంపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉద్యోగుల్లో రాష్ట్రంలో పల్నాడు జిల్లాలో అత్య ధికంగా ఉన్నారు. పల్నాడు జిల్లా లో 79 మంది, గుంటూరు జిల్లా లో 57 మంది, బాపట్ల జిల్లాలో 17 మంది పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఆయా ఉద్యోగులకు ఆదేశాలు అందాయి. దీంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారు.

తల్లడిల్లిన జనకవరం

- తెలంగాణలో బిడ్డల్ని చంపి తల్లి ఆత్మహత్య
- మృతదేహాల కోసం బంధువుల ఎదురుచూపు
- పనులకు వెళ్లిన దంపతుల మధ్య ఘర్షణతో.. దారుణం

పంగులూరు, అక్టోబరు 21 (ఆంధ్రజోతి): ఊరు నుంచి పిల్లలతో కలిసి పనులకు వెళ్లారు.. సుదూరంగా ఉంటున్నా భార్యాభర్తలు సంతోషంగా ఉంటున్నారని బంధువులు భావించారు. దీపావళి సంబరాల్లో మునిగితేలిన బంధువులు, గ్రామస్థులు దారుణ ఘటన సమాచారంతో తల్లడిల్లారు. తల్లి పిల్లల్ని హతమార్చి ఆత్మహత్య చేసుకున్న ఘటనతో మండలంలోని జనకవరం వాసులు కలవరం చెందారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. జనకవరం గ్రామానికి చెందిన కుంచాల రమేష్, నాగ లక్ష్మి (27) భార్యభర్తలు. వీరికి అవంతిక(9), భువన సాయి(7) అనే ఇద్దరు సంతానం ఉన్నా రు. రమేష్ భార్య పిల్లలతో కలిసి కొన్నేళ్ళుగా తెలంగాణలోని నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి గ్రామంలో నివాసం ఉంటూ బేల్దారి పనులతో జీవనం వెళ్లదీస్తున్నారు. పిల్లలు అక్కడే పాఠశాలలో చదువుకుం టున్నారు. ఈ నెల 19న ఆదివారం దంపతులు గొడవపడ్డారు. దీంతో భర్త రమేష్ భార్యకి చెప్ప కుండా స్వగ్రామమైన జనకవరం చేరుకున్నాడు. అయితే భర్త ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కలత చెందిన భార్య నాగలక్ష్మి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు ఆమెకు చెప్పారు. దీంతో ఇంటికి చేరుకున్న నాగలక్ష్మి సోమవారం తెల్లవారు జామున ఇద్దరు పిల్లల్ని చంపి తను ఉరి వేసుకొంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయం జనకవరంలోని కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు గ్రామస్థులకు తెలియడంతో గ్రామంలో రోదనలు మిన్నంటాయి. అందరూ పండుగ సంబరాల్లో ఉండగా తల్లి, బిడ్డల మరణవార్త తెలియడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకుంది. దంపతుల మధ్య మనస్పర్థలు ఇంతటి దారుణ ఘటనకు దారితీయడంతో బంధువులు, గ్రామస్థులు విస్మయం చెందుతున్నారు. తల్లి, చిన్నారుల మృతదేహాల కోసం విషన్న వదనాలతో ఎదురుచూస్తున్నారు.



గ్రామంలోని రమేష్ స్వగృహం



పిల్లలతో నాగలక్ష్మి (ఫైల్‌ఫొటో)

ఇల్లులేని పేదలందరికీ హౌసింగ్ స్కీమ్ వర్తింప చేయాలి

- కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ కట్టర్‌ను కోరిన ఎంపీ తెన్నేటి

బాపట్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పార్లమెంట్ పరిధిలో విద్యుత్ ప్రాజెక్టు ఒకటి ఏర్పాటు చేయాలని, ఇల్లు లేని పేదలందరికి హౌసింగ్ స్కీమ్ వర్తింప చేయాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాలు, విద్యుత్ శాఖా మంత్రి మనోహర్‌లాల్ కట్టర్‌ను ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ కోరారు. దీపావళి పండుగ సందర్భంగా కేంద్రమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీ కృష్ణప్రసాద్ పలు విషయాలను ఆయన దగ్గర ప్రస్తావించారు. విద్యుత్ ప్రాజెక్టు విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి చెప్పినట్లు ఎంపీ తెలిపారు. ఈ ప్రాజెక్ట్ వస్తే గ్రిడ్ కనెక్టివిటి వచ్చి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగఅవకాశాలు వస్తాయని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.



కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ కట్టర్‌తో మాట్లాడుతున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

క్రీడలు స్నేహపూర్వకంతో ఉండాలి

రాష్ట్ర స్థాయి స్పీడ్ సైక్లింగ్ పోటీల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వేగేశన

పిట్టలవానిపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులకు క్రీడలు స్నేహభావపూర్వకంగా ఉండటంతోపాటు విజయాన్ని, అపజయాన్ని ఒకేవిధంగా చూసుకోవాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పిట్టలవానిపాలెంలో దీపావళి పండుగ సందర్భంగా వేగేశన ఫౌండేషన్ సహకారంతో రాష్ట్రస్థాయి స్పీడ్ సైక్లింగ్ పోటీలను ఎమ్మెల్యే నరేంద్రవర్మ, బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు జెండా ఊపి ప్రారంభించారు. విజేతలుగా చందోలు గ్రామపంచాయతీ పరిధిలోని నదిముల్లాయపాలెం గ్రామానికి చెందిన జవహర్‌బాషా ప్రథమ బహుమతి రూ.50,116లు, చెరుకుపల్లికి చెందిన పాలపర్తి దిలీప్‌కుమార్ ద్వితీయ బహుమతి రూ.40,116, ఇంటూరుకు చెందిన ప్రజ్ఞావంశీ తృతీయ బహుమతి రూ.30,116 గెలుచుకున్నారు.



జవహర్‌బాషాకు ప్రథమ బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, బాపట్ల రూరల్ సీఐ హరికృష్ణ తదితరులు

అవీ..ఇవీ..

ఉపాధ్యాయుని సెల్‌ఫోన్ చోరీ

మార్టూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎం ఈశ్వరప్రసాద్ జేబులో నుంచి సెల్‌ఫోన్ ను క్షణాల్లో తస్కరించి అగంతకుడు పారిపోయిన వైనం సోమవారం మార్టూరు సెంటర్లో చోటుచేసుకొంది. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యాహ్న సమయంలో ఒక పూలదుకాణం వద్ద పూలును కొనుగోలు చేస్తున్న ఉపాధ్యాయుని వద్దకు సుమారు పాతికేళ్లయువకుడు వచ్చి, సార్ మీ డబ్బులు కిందపడిపోయాయని చెప్పాడు. దీంతో ఈ డబ్బులు తనవి కావని ఉపాధ్యాయుడు చెప్పడంతో, సరే నంటూ ఆ యువకుడు కింద నేలమీద ఉన్న డబ్బులను తీసుకున్నాడు. అదే క్షణంలో ఉపాధ్యాయుని జేబులోని రూ. 40 వేల విలువైన సెల్‌ఫోన్‌ను తస్కరించాడు. తర్వాత మరో యువకునిపై క్షణాల్లోనే వెళ్లిపోయాడు. అప్పటికీ, ఉపాధ్యాయుడు తన సెల్‌ఫోన్ పోయిన విషయం గమనించలేదు. కాని పూలదుకాణం యజమాని సార్ మీ జేబు నుంచి యువకుడు ఏదో తీశాడంటూ ఉపాధ్యాయునికి చెప్పడంతో, ఆశ్చర్యపోవడం ఉపాధ్యాయుడి వంతైంది. జేబు తడుముకుంటే, జేబులోని సెల్‌ఫోన్ కనిపించలేదు. దీంతో ఈ యువకుడు సెల్‌ఫోన్‌ను కాజేశాడని గ్రహించిన ఉపాధ్యాయుడు,వెంటనే తన కుమారునికి ఫోన్ చేసి ఫోన్ లో ఉన్న సిమ్ నంబరును బ్లాక్ చేయించాడు. తరువాత ఈ విషయాన్ని మార్టూరు స్టేషన్‌లో పోలీసులు దృష్టికి తీసుకువెళ్లాడు. అక్కడ షరా మామూలే.. ఈ సెల్‌ఫోన్ దొంగతనాలు ఎక్కువయ్యాయని పేర్కొంటూ పోలీసులు విచారిస్తున్నారు.

రోటరీ బలోపేతానికి అందరూ కృషి చేయాలి


డాక్టర్ రాంప్రసాద్‌కు చెక్కులను అందజేస్తున్న దాతలు

అద్దంకిటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రోటరీ సంస్థ ప్రపంచవ్యాప్తంగా అనేక సేవలు అందిస్తోందని, ప్రతి సభ్యుడు రోటరీ ఫౌండేషన్‌కు నిధులు సమకూర్చి బలోపేతం చేయాలని రోటరీ డిస్ట్రిక్ 3150 గవర్నర్ డాక్టర్ ఎస్‌వీ రాంప్రసాద్ అన్నారు. మంగళవారం అధికార పర్యటనలో భాగంగా అద్దంకి వచ్చిన ఆయన రోటరీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. గాజులపాలెం హైస్కూల్, వేలమూరిపాడు రోడ్డులోని రోటరీ పార్కులో మొక్కలు నాటారు. అనంతరం సింగరకొండలో జరిగిన సభ కార్యక్రమం నిర్వహించారు. శ్రీరామ వృద్ధుల ఆశ్రమానికి సీనియర్ రోటేరియన్ జాగర్లమూడి శివకుమారి రెండు లక్షల విలువైన చెక్కును ఆశ్రమ నిర్వాహకుడు రావూరి రంగయ్యకు రాంప్రసాద్ అందజేశారు. కాకతీయ సేవా సత్రం వద్ద వినాయకస్వామి మందిరానికి రూ.లక్షను బాధ్యులు సందిరెడ్డి శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణ చంద్రరావు, సెక్రటరీ అలహరి హరిప్రసాద్, ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ పణింద్రబాబు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో క్రీడా వస్తువులు పంపిణీ


హెచ్‌ఎంకు ఆట వస్తువులను అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

కొమర్నేనివారిపాలెం (పర్చూరు), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో పర్చూరు మండలంలోని కొమర్నేనివారిపాలెం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు రూ.12వేల విలువైన క్రీడావస్తువులను రోటరీ ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. విద్యతోపాటు, క్రీడలను కూడా పోత్సహించాలన్న సంకల్పంతో ఆయా ప్రభుత్వ పాఠశాలకు క్రీడా వస్తువులను అందజేసినట్లు దాత అసిస్టెంట్ గవర్నర్ నాగబైరు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్, ఎంఈవో వెంకట్రామయ్య, పంబి సదానందెడ్డి, పాబోలు ఉదయ భాస్కర్, మున్నంగి సుబ్బయ్య, కోమటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి మైనారిటీల సమస్యలు

● మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహమ్మద్


మైనారిటీ విభాగం నాయకులతో మాట్లాడుతున్న ముస్తాక్ అహమ్మద్

మార్టూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మైనారిటీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని రాష్ట్ర ముస్లిం మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహమ్మద్ అన్నారు. సోమవారం మార్టూరు వచ్చిన ఆయనకు పలువురు ముస్లిం మైనారిటీలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పర్చూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలూరి సహకారంతో ప్రతి ముస్లింకు సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పఠాన్ ఖాదర్ వలి, కోట మస్తాన్‌వలి, సెల్ సుభాని, మహమ్మద్, ఇషాక్, పసుమర్తి కరిముల్లా, కారచేల గాలిబ్ బుడే, ముల్లా మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

వైద్యం నిమిత్తం ఎల్‌వోసీ అందజేత

మార్టూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మార్టూరు గ్రామానికి చెందిన బాధితురాలు అలపర్తి కృష్ణకుమారికి రూ. 1.50 లక్షల విలువైన ఎల్‌వోసీ చెక్కును, మంగళవారం ఏలూరి క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయకులు అందజేశారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బాధిత మహిళకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి సాయం అందేలా కృషి చేశారు. ఈ మేరకు ఆమెకు మంజూరైన పత్రాలను బాధితురాలికి నాయకులు అందజేశారు. కార్యక్రమంలో కొమ్మినేని వెంకట్, కామేపల్లి హరిబాబు, కామినేని జనార్దన్, షేక్ రజాక్, పెంట్యాల శ్రీను పాల్గొన్నారు.

నేటి నుంచి అన్నదానం ప్రారంభం

ఇంకొల్లు,అక్టోబరు 21,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లులో పోలేరమ్మగుడి ఆవరణలో అయప్ప సేవాసమితి ఆధ్వర్యంలో ఈ నెల 22 బుధవారం నుండి 41 రోజుల పాటు మాలధారణ చేసిన అయ్యప్ప, శివ, భవానీ గోవింద స్వాములకు అన్నదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మార్టూరు : కార్తీకమాసం ప్రారంభంతో జాతీయ రహదారి పక్కన ఉన్న శ్రీ దుర్గామల్లేశ్వరీస్వామి దేవస్థానం వద్ద, పల్నాడు జిల్లా బొప్పూడి శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం నుంచి అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం (చద్ది)ని ప్రారంభిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

అద్దంకిలో అన్నదానం

అద్దంకి : అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా మంగళవారం అద్దంకి పట్టణంలోని పాతబస్టాండ్ సెంటర్ లో మారం హనుమంతరావు, వడ్లమూడి పావని ల సహకారం తో అన్నదానం నిర్వహించారు. నిర్వాహకులు పాల్గొన్నారు.

వెలుగులీనిన ముంగిళ్లు

● దీపాలతో ఇళ్లను అలంకరించిన మహిళలు ● ఉత్సాహంగా బాణసంచా కాల్చిన యువత


చినగంజాంలో బాణసంచా దుకాణాల వద్ద సందడి

చినగంజాం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ప్రజలు దీపకాంతుల మేళవింపుతో దీపావళి పండుగను చేసుకున్నారు. సోమ, మంగళవారాలలో సాయ్రతం వేళ సందడిగా పండుగ నిర్వహించారు. లక్ష్మి అమ్మవారికి విశేషపూజలు నిర్వహించి ముంగిళ్లల్లో కాంతులు విరజిమ్మేల దివ్వెలను ఏర్పాటు చేశారు. పెద్దలు, మహిళలు, యువతీ యువకులు, చిన్నారులు ఆనందోత్సహాల మధ్య బాణసంచా కాల్చారు. మహిళలు ప్రమిదలు వెలిగించారు. తమ జీవితాల్లో చీకట్లు పార్రదోలి వెలుగులు నింపాలని కోరుకున్నారు. పలు ఆలయాలల్లో భక్తులు పూజల నిర్వహించారు. గ్రామాలు టపాసుల మోతతో మారుమోగాయి.

పర్చూరు : దీపావళి పర్వదిన వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిటపట ధ్వనులలో వీధులు, గ్రామాలు హోరెత్తాయి. ఇంటి ముందు సుందరంగా తీర్చిదిద్దిన ముగ్గుల్లో మహిళలు ఏర్పాటు చేసిన దీపాలు పండుగ వాతావరణాన్ని సంతరింపజేశాయి. చిన్నారులు, యువకులు, వృద్ధులు సైతం టపాసులను కాలుస్తూ ఉల్లాసంగా గడిపారు. కులమతాలకు అతీంగా గ్రామాలు, పల్లెల్లో సైతం బాణసంచా సందడి నెలకొంది. పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు, నాగులపాలెం, నూతలపాడు, అడుసుమల్లి, అన్నంబొట్ల వారిపాలెం, ఉప్పుటూరు తదితర గ్రామాల్లో వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు.



పర్చూరు జయంతి కాలనీలో దీపావళి సంబరాలు, అద్దంకి పోలీసు స్టేషన్‌లో దీపావళి వెలుగులు

చీరాల : నియోజకవర్గంలో గతేడాది కంటే ఈ దీపావళి వేడుకలు కాస్త ఘనంగా నిర్వహించారు. జిల్లా అగ్నిమాపక అధి కారి వినయ్, ఏపీఎఫ్‌వో రామకృష్ణలు ప్రమాదాలు జరగకుండా పలు జాగ్రత్తలు తీసుకున్నారు. స్టాల్స్ వద్ద నిబంధన లను అనుసరించే విధంగా హెచ్చరికలు జారీ చేసి అనుమతులు కల్పించారు. దుకాణ నిర్వాహకులు కూడా దాదాపుగా జాగ్రత్తలు పాటించారు. అలాగే యువత వీధుల్లో ఉత్సాహంగా బాణసంచా కాల్చారు. అయితే ఎక్కడా, ఎటువంటి సమస్యలు లేకుండా ఈ ఏడాది వేడుకలు జరగడంతో అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

అంబరాన్ని అంటిన దీపావళి సంబరాలు

అద్దంకి : దీపావళి సంబరాలు అంబరాన్ని అంటాయి. వర్షపు జల్లులు పడుతున్నా.., సోమవారం ఒకింత తెరపి ఇవ్వడంతో ప్రజలు దీపావళిని ఉత్సాహంగా నిర్వహించకున్నారు. చిన్నా, పెద్దా తారతమ్యం మరిచి అందరు కుటుంబసభ్యులు కలిసి బాణసంచాను ఉత్సాహంగా కాల్చారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ముందు దీపాలను వరుసలుగా వెలిగించారు. బాణసంచా కాల్చారు. అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో సిబ్బంది బాణసంచా కాల్చారు. పాత గాంధీబొమ్మ కూడలిలో యువకులు నరకాసురిని చిత్ర పటాలను దహనం చేశారు.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అద్దంకిటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సీజనల్‌గా వచ్చే వ్యాధుల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, బాపట్ల జిల్లా మలేరియా నివాణాధికారి, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ రత్నమన్‌మోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని వెంపరాల గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో జ్వరం, నొప్పులతో బాధపడుతున్న వారి సమాచారం అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో కొన్నిరోజుల నుంచి చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలను ఎంపీడీవో బీ.వరూధిని, డాక్టర్ గొట్టిపాటి జయసింహాలు మలేరియా నివారణాధికారికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రెండు రోజుల్లో నొప్పులకు సంబంధించిన ఇంజక్షన్‌లు, మాత్రలను గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద, వెల్‌నెస్ సెంటర్ వద్ద పంపిణి చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈవో నాగేశ్వరరావు, సూపర్‌వైజర్ సత్తార్, పీహెచ్‌ఎన్ కన్యాకుమారి, ఏఎన్‌ఎం శారద, ఎంఎల్‌హెచ్‌పీ సైదులు, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.


వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న మలేరియా నివారణ అధికారి

జాతీయస్థాయి పోటీలకు చీరాల వాసి ఎంపిక

చీరాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గడ్ లో ఈ నెల 26 నుండి 31 వరకు నిర్వహించే ఫుట్‌బాల్ అండర్ -13 పోటీలకు చీరాల పరిధిలోని మేరీ క్రిస్టియన్‌పేటకు చెందిన ఎన్ ఎఫ్రాయిమ్ ఎంపికయ్యాడు. ఇటీవల డివిజన్ స్థాయి, అనంతరం గుంటూరులో జరిగిన జిల్లాస్థాయి, తరువాత రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ఎఫ్రాయిమ్ సత్తా చాటాడు. దీంతో కోచ్ ప్రసన్న, బాబాలను ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు విజయ్‌కుమార్, సమ్మర్ ఫుట్‌బాల్ కోచ్ బొనిగల ప్రేమయ్య, నరేష్‌లు ప్రత్యేకంగా అభినందించారు. క్రీడల్లో చిన్నారులను ప్రోత్సహించాలని చెప్పారు.


ఎఫ్రాయిమ్‌ను అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కుక్కలతో బెంబేలెత్తుతున్న గ్రామస్థులు

మేదరమెట్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కుక్కల స్వైర విహారంతో విద్యార్థులు, మహిళలు గ్రామస్థులు బెంబేలెత్తిపోతున్నారు. మేజర్ పంచాయతీ అయిన మేదరమెట్లతో పాటు మరో రెండు మేజర్ పంచాయతీలైన, రావినూతల, పమిడిపాడులో ఇతర గ్రామాల్లో కూడా కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ప్రధాన వీధులలో గుంపులు, గుంపులుగా తిరుగుతూ ద్విచక్రవాహనదారులపై దాడులకు తెగబడుతున్నాయి. దీంతో ద్విచక్రవాహనదారులు కింద పడిపోతున్నారు. దీనికి తోడు వాహనాలపై వెళుతున్న వారికి వెనుక నుంచి వచ్చి పిక్కలు పట్టుకోవడంతో కింద పడి తీవ్రంగా గాయపడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే పిల్లలు, పనులపై వీధులలోకి వచ్చే మహిళలు కుక్కలను చూసి భయపడుతున్నారు. ఇటీవల కాలంలో కుక్కకాటుకు గురై హస్పిటల్‌లో వ్యాక్సిన్ చేయించుకున్నవారు అనేక మంది ఉన్నారు. పక్కగ్రామాలకు పనులపై బయలుదేరిన వారు కుక్క కాటుకు గురవు తున్న ఘటనలు పెరుగుతున్నాయి. ఇటీవల అధికారులకు, ప్రజా ప్రతినిధులకు గ్రామస్థులు ఈ సమస్యలపై ఫిర్యాదులు చేస్తున్నారు. రావినూతల గ్రామంలోనూ కుక్కల బెడద ఎక్కువగా ఉందని, గ్రామస్థులు ఇటీవల అధికారులు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కుక్కల భారీ నుంచి తమను రక్షించాలని, గ్రామస్థులు కోరుకుంటున్నారు.


మేదరమెట్లలో స్వైరవిహారం చేస్తున్న కుక్కలు

రేపు కొత్తపేటలో విద్యుత్ లోక్‌అదాలత్

● సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్

చీరాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రేపు గురువారం కొత్తపేట రావి సుబ్బారాయుడు కల్యాణ మండపంలో విద్యుత్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జాన్ థామస్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఈఆర్‌ఎఫ్(కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెసల్ ఫోరం) విజయవాడ వారి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్, తదితర జిల్లా అధికారులు పాల్గొంటున్నట్లు చెప్పారు. వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలన్నారు.

పాత హైవేకు మహర్దశ

● సుదీర్ఘ కాలం సమస్యకు పరిష్కారం

కొత్తపేట (చీరాల), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు - నరసరావుపేట పాత హైవేకు మహర్దశ వచ్చింది. సుదీర్ఘ కాలంగా రహదారి గోతుల మయంగా మారి అధ్వానంగా ఉంది. దీంతో పలుమార్లు ప్రమాదాలు సైతం చోటుచేసుకొన్నాయి. పలువురు గాయపడ్డ ఘటనలు ఉన్నాయి. ఇటీవల జరుగుతున్న 167ఏ రహదారి నిర్మాణంలో భాగంగా పాలకులు, అధికారులు పాత జాతీయ రహదారిపై దృష్టి సారించారు. ఈక్రమంలోనే మంగళవారం ఆయా రహదారి మరమ్మతులు ప్రారంభించారు. దీంతో చాలావరకు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.


రహదారి వెంబడి కొనసాగుతున్న మరమ్మతులు

శింగరకొండలో మంత్రి స్వామి విశేష పూజలు

అద్దంకి, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి దంపతులు, కుటుంబసభ్యులతో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో పూజారులు మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి దంపతులకు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడారు. శింగరకొండ ఆలయానికి ఎంతో ప్రాశస్థం ఉందన్నారు. సీఎం సంకల్పానికి స్వామి వారీ ఆశీస్సులు తోడై రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామి వారిని కోరినట్లు తెలిపారు. సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు ఆహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. పీఎం మోదీ, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల సహకారంతో ప్రజా కూటమి పాలనతో రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు.

అద్దంకి : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో అమవాస్య సందర్భం గా మంగళవారం దశసహస్ర కదళీఫలార్చన వైభవంగా నిర్వహించారు. ప్రాంతః కాల పూజల అనంతరం స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం 10 వేల అరటి పండ్ల తో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని అలంకరించారు. ఉభయదాతలు గా ఒంగోలుకు చెందిన పావులూరి నాగేశ్వరరావు దంపతులు వ్యవహరించారు. అమావాస్యతో పాటు మంగళవారం కూడా కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న మంత్రి స్వామి

రోడ్డు అంచులో ప్రమాదవశాత్తు లారీ బోల్తా

బల్లికురవ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అద్దంకి నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి కొప్పెరపాడు గ్రామ సమీపంలో మంగళవారం తెల్లవారు జామున కంటైనర్ లారీ రోడ్డు మార్జిన్‌లో బోల్తా కొట్టింది. అందిన సమాచారం మేరకు హైదరాబాద్ వైపు నుండి చెన్నై వైపు వెళుతున్న కంటైనర్ లారీ డ్రైవర్ నిద్ర మత్తులో రోడ్డు మార్జిన్‌లోకి లారీ బోల్తా కొట్టింది. ప్రమాదంలో లారీలో ఉన్న డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. కొప్పెరపాడు గ్రామ ప్రజలు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.

ప్రమాదంలో గాయపడిన రైతు మృతి

బల్లికురవ, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పెరపాలెం గ్రామానికి చెందిన రైతు కొండవర్థు పున్నయ్య(43) ప్రమాదవశాత్తు గాయపడి సోమవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు కొప్పెరపాలెం గ్రామానికి చెందిన పున్నయ్య అను రైతు పంట పొలానికి వెళ్లి మేత తెచ్చుకుంటుండగా ఎదూరుగా వస్తున్న బైకు ఆయన్ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పున్నయ్యను వారి బంధువులు గుంటూరు వైద్యశాలకు తరలించగా వైద్యశాలలో చికిత్స పొందుతూ రైతు మృతి చెందాడు. మృతుని భార్య బాపమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు ఎస్‌ఐ వై. నాగరాజు తెలిపారు. మృతునికి ఇరువురు కుమార్తెలు కలరు.

విధుల నుంచి ఇద్దరు క్షేత్రసహాయకుల తొలగింపు

బల్లికురవ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏడాది కాలంలో నిర్వహించిన ఉపాధి హామీ పథకం పనులలో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందాలు గుర్తించాయి. ప్రజావేదిక ద్వారా అధికారుల ముందు ఉంచారు. వారి నివేదికల ఆధారంగా జిల్లా డ్వామా పీడీ విజయలక్ష్మి బల్లికురవ మండలం మల్లాయపాలెం, కొప్పెరపాలెం క్షేత్రసహాయకులు గంగయ్య, ప్రశాంత్‌లను తాత్కాలికంగా విధుల నుంచి తొలగించారు. ఆ మేరకు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. అలానే గత వైసీపీ ప్రభుత్వంలో పనులు చేసి నిధులను పక్కదారి పట్టించిన మరో 8 మంది క్షేత్ర సహాయకులతో పాటు ఇప్పుడు విధులలో నలుగురు క్షేత్రసహాయకులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లా అధికారుల నుంచి ఇరువురు క్షేత్ర సహాయకులను తొలగిస్తూ, పోస్టులో ఉత్తర్వు లు వచ్చాయని ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. మండలంలో గత రెండు మాసాల క్రితం ఉపాధి హామీ పథకానికి సంబంధించి సామాజిక తనిఖీ జరిగింది. పలు గ్రామాలలో రూ.3 కోట్ల మేర పనులలో అవ కతవలకు జరిగాయని తనిఖీ చేసిన బృందాలు ప్రజా వేదికలో వెల్లడించాయి. వారి నివేదికల ద్వారా ఇద్దరు క్షేత్ర సహాయకులపై వేటు వేశారు. మరో నివేదికలో పనులు చేయించిన మండల స్థాయి అధికారులపై వేటు వేసే అవకాశాలు ఉన్నాయి.


ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు (ఫైల్)

పారిశుధ్య కార్మికుడికి గాయాలు

అద్దంకి, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో పారిశుధ్య కార్మికుడు గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు అద్దంకి మున్సిపాలిటీ లో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న మున్నంగి వెంకటరావు మంగళవారం కొత్త దామావారిపాలెం లో రామాలయం వద్ద విధులు నిర్వహిస్తుండగా జారి కాలువ లో పడ్డాడు. 108 సిబ్బంది హరిబాబు ప్రథమ చికిత్స నిర్వహించి అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు.

సుందరరావును పరామర్శించిన ఎమ్మెల్యే బీఎన్

చినగంజాం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంతరావూరు గ్రామానికి చెందిన టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవతోటి సుందరరావును సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్.విజయ్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. సుందరరావు కాలుకి ఇన్ఫెక్షన్ రావడంతో వైద్యశాలలో చికిత్స చేయించుకున్నారు. దీంతో సంతరావూరు గ్రామంలోని సుందరరావు స్వగృహానికి శాసనసభ్యులు విజయ్‌కుమార్ వెళ్లి ఆయన్ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని గురించి తెలుసుకున్నారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ఎస్సీసెల్ కార్యదర్శి రంపతోటి అంకారావు, నందిగం కోటయ్య, కంకణాల గోపీ, పలువురు నాయకులు పరామర్శించారు.

పంగులూరులో ముగిసిన ఖోఖో శిక్షణ

పంగులూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పురుషుల రాష్ట్ర ఖోఖోజట్టు శిక్షణ మంగళవారం పంగులూరులో ముగిసింది. ఈ నెల 24 నుంచి 26 వరకు కర్నాటక రాష్ట్రంలోని ధావణగిరిలో జరిగే దక్షిణాది రాష్ట్రాల జాతీయస్థాయి పురుషుల ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు పంగులూరులోని ఎస్ఆర్ఆర్ అకాడమీలో ఈ నెల 15 నుంచి శిక్షణ ఇస్తున్నారు. స్థానిక ఎంఎస్ఆర్ అండ్ బీఎన్ఎం జూనియర్ కళాశాలలో సీనియర్ ఖోఖో క్రీడాకారుడు షేక్ ఆలీనవాజ్ జట్టుకు శిక్షకుడిగా వ్యవహరించారు. జట్టు క్రీడాకారులకు ఎస్ఆర్. స్పోర్ట్స్‌వేర్ అధినేత ఎం.సీతారామిరెడ్డి క్రీడాదుస్తులు సమకూర్చగా సీఐ పాల్‌రాజ్ దుస్తులను క్రీడాకారులకు అందచేశారు. శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ప్రకాశం జిల్లా ఖోఖో అసోషియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు కుర్రాభాస్కరరావు, కాశీవిశ్వనాదరెడ్డిలు మాట్లాడుతూ క్రీడా నైపుణ్యంతో జట్టు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. మంగళవారం సాయంత్రం రాష్ట్ర ఖోఖో అసోషియేషన్ కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కోశాధికారి హనుమంతరావు, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పోటీలలో పాల్గొనే పురుషుల ఖోఖో జట్టు

కర్నాటక రాష్ట్రంలో ఈ నెల 24 నుంచి జరిగే దక్షిణాది రాష్ట్రాల జాతీయస్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర పురుషుల ఖోఖో జట్టును రాష్ట్ర అసోషియేషన్ కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి ప్రకటించారు. జట్టులో పి.సూరినాయుడు, కె.మహేష్, ఎల.షాలోమ్ రాజు, వై.సుధీర్‌కుమార్, ఎస్.కె.మహమ్మద్, ఐ.ఏలియా (ప్రకాశం), ఎం.ఫణికుమార్, కె.ప్రవీణ్(రైల్వే), కె.కొండలరావు(కృష్ణ), బి.కిరణ్ (విశాఖ), జి.శాంతేష్(అనంతపురం), కరి శివశంకర్(తూర్పుగోదావరి), పి.వరుణ్ (చిత్తూరు), వై.ఆశిష్‌కమల్(నెల్లూరు), బి.సింహాద్రినాయక్ (గుంటూరు)ఉన్నారు. జట్టుకు కోచ్‌గా ఆలీనవాజ్, మేనేజర్‌గా ఎన్.అజయ్‌కుమార్ వ్యవహరిస్తారని సీతారామిరెడ్డి తెలిపారు.


పురుషుల ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్రజట్టు

మానసిక ఆరోగ్యమే విద్యార్థి విజయానికి మూలం

ఇంకొల్లు,అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి) : మానసిక ఆరోగ్యం విద్యార్థి విజయానికి మూలాధారం అని కెరియర్ గైడెన్స్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ఎన్.ప్యారిజాన్ సూచించారు. ఇంకొల్లు ఎన్ఆర్ వీఎస్ఆర్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ప్యారిజాన్ విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, ఒత్తిని నియంత్రణ, సానుకూల ఆలోచన, ఆత్మవిశ్వాసం పెంపు విద్యార్థుల సమగ్ర అభివృద్ధి గురించి అవగాహన కల్పించారు. వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన నైపుణ్యాలను అభ్యసించడం గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
బుధవారం 22 అక్టోబరు 2025


నెల్లూరు నగరంలో సోమవారం రాత్రి దీపావళి సందడి




రాజరాజేశ్వరి ఆలయం, మూలస్థానేశ్వర ఆలయాల్లో సామూహికంగా కేదారేశ్వర నోములు నోచుకుంటున్న భక్తులు

ఘనంగా దీపావళి

- వైష్ణవాలయాల్లో మహాలక్ష్మి పూజలు
- భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర వ్రతం
- వరుణుడి కరుణ, మోతమోగిన బాణసంచా

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ప్రజలు దీపావళిని సోమవారం ఘనంగా నిర్వహించారు. వైష్ణవాలయాల్లో మహాలక్ష్మి పూజలు, శివాలయాల్లో కేదారేశ్వర వ్రతాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచుకున్నారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సోమవారం ఉదయం భారీ వర్షం కురవగా. సాయంత్రానికి తెరపివ్వడంతో ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి భారీగా బాణసంచా పేల్చారు.రాత్రి ఏడు నుంచి పదకొండు గంటల వరకు బాణసంచా పేలుళ్లతో నగరం దద్దరిల్లింది. మంగళవారం సాయంత్రం వరకు దీపావళి ఘడియలు ఉండడంతో ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నగరంలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామికి సోమవారం రాత్రి పేట ఉత్సవం వైభవంగా జరిగింది. దీపాలంకరణ, శివనామస్మరణలు జరిగాయి. రాజరాజేశ్వరి ఆలయంలో సుందరేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, నిర్వహించారు. తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీదేవి,భూదేవి సమేత రంగనాథస్వామికి తిరుమంజనం కనుల పండువగా జరిగింది. సాయంత్రం స్వామివారి పేట ఉత్సవం జరిగింది. ఈ కార్యక్రమాలను ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.


మూలాపేటలో భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి పేట ఉత్సవం


మనుబోలులో జోరుగా పారుతున్న కండలేరు కాలువ


బుచ్చి : జొన్నవాడ వద్ద పెన్నానదిలో వరద ప్రవాహం

వీడని వాన

- ఆరు రోజులుగా కురుస్తున్న వాన
- జనజీవనం అస్తవ్యస్తం
- వాహనాల రాకపోకలకూ బ్రేక్
- పలుచోట్ల నేలవాలిన వరి
- నేలకూలిన చెట్లు, స్తంభాలు,
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- నేడు విద్యాలయాలకు సెలవు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్
- 25 వరకు వర్షాలు కురిసే అవకాశం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం జిల్లాలో జోరు వాన కురిసింది. ఆరు రోజు ల నుంచి ఎడతెరిపి లేని వర్షంతో జనజీవనం అతాకుతలమైంది. భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయ్యాయి. వర్షం మొదలైతే గంటల తరబడి కురుస్తోంది. ఆగిఆగి కురుస్తున్న వర్షంతో పనులు కాక జనం ఇబ్బందులు పడ్డారు. వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. ప్రాజెక్టులు, చెరువులు,వాగులు,వంకలు నీటితో కళకళలాడుతున్నాయి. ఈనెల 25 వరకు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావారణశాఖ తెలిసింది. కొడవలూరులో అత్యధికంగా 227మి.మీ, అత్యల్పంగా వరికుంటపాడులో 85.4 మి.మీ వర్షపాతం నమోదైంది. మంగళవారం ఒక్కరోజే సగటు వర్షపాతం 25 మి.మీగా నమోదైంది.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భారీ వర్షాల నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ శంకరన్ హాల్లో భారీ వర్షాలపై మండల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ యంత్రాంగం లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. తీర ప్రాంత ప్రజలు, మత్స్యకారులను అప్రమత్తం చేస్తూ, ఎవరూ సముద్రంలోకి వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేయాలని కోరారు. కాగా నీటి మునిగిన పంట పొలాల వివరాలను సేకరంచి ప్రాథ మిక నివేదిక సిద్ధం చేయాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని తెలిపారు. వర్షాల వల్ల ఇబ్బందులు తలెత్తిన వారు 0861-2331261, 7995576699 నంబర్లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈనెల 25 వరకు కంట్రోల్ రూం పనిచేస్తుందని తెలిపారు.

నేడు పాఠశాలలు, కళాశాలలకు సెలవు

నెల్లూరు(విద్య) : భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాలతో బుధవారం జిల్లా వ్యాప్తంగా అన్నీ పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్నీ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు కూడా బుధవారం సెలవు ప్రకటించాలని, ప్రభుత్వ ఆదేశాలను తప్పక పాటించాలన్నారు.


ఏఎస్ పేటలో రోడ్డుకు అడ్డంగా కూలిన వృక్షం

ఏఎస్‌పేటలో కూలిన చెట్లు

ఏఎస్‌పేట : మండలంలో మంగళవారం భారీగా వర్షం కురిసింది.దీంతో పోలీస్ స్టేషన్ సమీపంలో రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలింది. అలాగే పలు చోట్ల చెట్లు రోడ్డుకు అడ్డంగా కూలి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.మంగళవారం కురిసిన వర్షంతో ఏఎస్ పేటతో పాటు పలు చోట్ల విద్యుత్‌కు అంతరాయం ఏర్పాడింది.

నిండుతున్న చెరువులు

మనుబోలు : మండలంలో జోరుగా కురవడం... అంతలోనే ఆగిపోవడం...సెకన్ల వ్యవధిలోనే మళ్లీ జల్లులు పడడం... ఇలా ఐదురోజులుగా వర్షం కురుస్తూనే ఉంది. నార్లు పోయకముందే ఇలాంటి వర్షాలు, తుఫాన్‌లు వస్తే సాగుకు ఇబ్బందులు ఉండవని రైతులు అంటున్నారు. అల్పపీడనం ఏర్పడకముందే చెరువుల్లో నీరు సమృద్ధిగా ఉంది. కురుస్తున్న వర్షాలకు మండలపరిధిలోని జాతీయ రహదారి చాలాచోట్ల దెబ్బతింది.


బిట్రగుంట : కొండబిట్రగుంట గిరిజన కాలనీలో వర్షపునీరు


అనంతసాగరం మండలం పాతాళపల్లిలో వర్షపునీటిలో వరి చేలు

వరి పైరుకు నష్టం

చేజర్ల : కురుస్తున్న వర్షాలకు మండలంలోని కాకివాయిలో కోతకు వచ్చిన వరి నీటమునిగి గింజలు మొలకెత్తాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వంద ఎకరాలలో కోతకు వచ్చిన వరిపైరు నేలపాలు కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈవిషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.

అనంతసాగరం: కురుస్తున్న వర్షం వల్ల మండలంలోని పలుగ్రామాల్లో వరిపైరు దెబ్బతింది. కోతకు వచ్చిన వరి నేలవాలడంతో పాటు పొలాల్లో వర్షపు నీరు చేరి రైతులు నష్టపోయారు. మండల వ్యవసాధికారి శైలజాకుమారి మంగళవారం పలుగ్రామాల్లో దెబ్బతిన్న వరిని పరిశీలించారు. పంట నష్టం అంచనాలు వేశామని, నివేదికను ఉన్నతాధికారులకు పంపుతానని తెలిపారు.

కావలి టీడీపీకి అండగా మాలేపాటి

- కష్టకాలంలో ఆదుకున్న నేతగా గుర్తింపు
- అకాల మరణంతో శోకసముద్రంలో అభిమానులు

కావలి, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి) కావలి నియోజకవర్గంలో టీడీపీ కష్టకాలంలో ఉన్న సమయంలో నేనున్నానంటూ మాలేపాటి సుబ్బానాయుడు ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. ఆయన అకాలమరణం కార్యకర్తలను, అభిమానులకు శోకసముద్రంలో ముంచింది. 2019 ఎన్నికల్లో కావలి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి రాష్ట్రంలో పార్టీ ఓటమి అనంతరం, స్థానిక నేతల విభేదాల కారణంగా పార్టీకి దూరమయ్యారు. అప్పటినుంచి కావలికి నాయకుడు లేక పార్టీ క్యాడర్ చిన్నాభిన్నం అయింది. నియోజకవర్గ ఇన్‌చార్జి కోసం పలువురిని ప్రతిపాదించినా, అధికారంలో ఉన్న వైసీపీకి భయపడి ఎవరూ ముందుకు రాలేదు. చివరకు పార్టీ అధిష్ఠానం బీద రవిచంద్రకు బాధ్యతలు అప్పగించేందుకు సిద్ధమైనా ఆయనకూడా రాష్ట్రపార్టీకి సేవలు అందించాలని ముందుకు రాలేదు. చివరకు మాలేపాటి సుబ్బానాయుడు ముందుకు వచ్చి పార్టీ ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించారు.

పార్టీకి నూతన ఉత్తేజం

అప్పటిదాకా నిస్తేజంలో ఉన్న కావలి టీడీపీలో మాలేపాటి నూతన ఉత్తేజాన్ని తీసుకువచ్చారు. 2022 నుంచి 24 వరకు పార్టీ ఇన్‌చార్జిగా కొనసాగుతూ వైసీపీ అవినీతి, అక్రమాలపై ఉక్కుపాదం మోపారు. టీడీపీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. అమరావతి రైతుల పాదయాత్ర, యువనేత లోకేష్ చేపట్టిన యువగళంను నియోజకవర్గంలో విజయవంతం చేశారు. అయితే 2024 ఎన్నికల నాటికి సామాజిక వర్గాల సమీకరణలో భాగంగా ఆయనకు అధిష్ఠానం ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వలేదు. ఎన్నికల అనంతరం రాష్ట్ర ఆగ్రోఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చి ఆయనకు పార్టీ సముచిత స్థానం కల్పించింది. ఈ నెల11న అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహించిన ఉన్నతాధికారుల సమీక్షలో కూడా మాలేపాటి పాల్గొని వ్యవసాయాభివృద్ధికి సలహాలిచ్చారు. అయితే అదే రోజు అమరావతిలోనే ఆయనకు బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చింది. దీంతో అక్కడే ఉన్న మణిపాల్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ ఈ నెల 20వతేదీ తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. అనంతరం ఆయన స్వగ్రామమైన దగదర్తిలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించారు. రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌లకు అధికార లాంఛనాలు లేకపోయినప్పటికి సుబ్బానాయుడి కోసం ప్రభుత్వం జీవో ఇచ్చి అధికారలాంఛనాలు కల్పించి ఆయన మరణానంతరం కూడా సముచిత స్థానం కల్పించింది.


ఈనెల 11న సీఎం చంద్రబాబుతో జరిగిన సమావేశంలో వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో కలిసి పాల్గొన్న మాలేపాటి సుబ్బానాయుడు(ఫైల్)

సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

సుబ్బానాయుడి మృతిపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి వారిని ఓదార్చారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని తెలిపారు.

లోకేష్ సంతాపం

సుబ్బానాయుడి మృతికి రాష్ట్ర విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. పార్టీలో అంచలంచెలుగా ఎదిగిన సుబ్బానాయుడు కావలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేశారన్నారు. పార్టీ పటిష్ఠతకోసం, ప్రజల అభ్యున్నతికి ఆయన విశేషంగా కృషిచేసారని, ఆయన మరణం పార్టీకి తీరని లోటన్నారు.

మూగబోయిన దగదర్తి

దగదర్తి (బిట్రగుంట), అక్టోబరు 21: సేవచేసే నేతల వెంటే జనం ఎప్పుడూ ఉంటారని మాలేపాటి కుటుంబీకులు నిరూపించారు.ఆ కుటుంబంలో ఇద్దరు నేతలు వెంట వెంటనే మృతి చెందడంతో దగదర్తి మండలం మూగబోయింది. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీసస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు (60) అనారోగ్యంతో సోమవారం తెల్లవారు జామున మృతి చెందారు. సుబ్బానాయుడు అన్న ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు చిన్నకుమారుడు, టీడీపీ యువనేత మాలేపాటి భానుచందర్‌నాయుడు ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో ఆ కు టుంబం శోకసముద్రంలో మునిగింది. సోమవారం ఉదయం భానుచందర్ అంత్యక్రియలకు సిద్ధమవుతున్న సమయంలో సుబ్బానాయుడు మృతి చెం దాడని తెలియడం మాలేపాటి కుటుంబాన్ని మరింత కుంగదీసింది. దగద ర్తి మండలం సున్నపుబట్టి జాతీయ రహదారి నుంచి మాలేపాటి కుటుం బ అభిమానులు, టీడీపీ కార్యకర్తలు భారీగా తరలివెళ్లి సుబ్బానాయుడు పార్థివదేహాన్ని స్వగృహం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆయన అంత్యక్రియలకు ప్రభుత్వ ప్రతినిధులుగా సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ హిమాన్షు శుక్లా హాజరై ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఉదయగిరి, కందుకూరు ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు మాలేపాటి మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులు అర్పించారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా
- నగరంలో భారీ ర్యాలీ

నెల్లూరు(క్రైం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజల భద్రతే లక్ష్యంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. పోలీసు పరేడ్ మైదానంలో మంగళవారం అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఆధ్వర్యంగా ఘనంగా నిర్వహించారు. తొలుత అమరవీరుల స్తూపం వద్ద విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులకు కలెక్టర్, ఎస్పీ, అమరవీరుల కుటుంబ సభ్యులు ఘన నివాళులు అర్పించారు. అనంతరం అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున చెక్కులు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1959 అక్టోబరు 21న జమ్మూ కశ్మీర్‌లోని హిమాలయ పర్వత శ్రేణుల్లో మనదేశ పరిహద్దు అయిన లడాక్ భూభాగంలోకి చైనా దురాక్రమణకు పాల్పడిన సమయంలో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన వీరజవాన్లకు నివాళిగా ప్రతిఏటా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. 2024 సెప్టెంబరు 1 నుంచి 2025 అక్టోబరు 1 వరకు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో 191 మంది పోలీసులు ప్రాణత్యాగం చేశారని, మన జిల్లాలో 10 మంది పోలీసులు ప్రాణాలు అర్పించారని వివరించారు. ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల మాట్లాడుతూ దేశం స్వేచ్ఛగా, స్వాతంత్రంగా ఉండటానికి పోలీసుల వీరోచిత పోరాటాలే కారణమన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ఎప్పుడూ భరోసాగా ఉంటామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంటీవో హరిబాబు ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ అమరవీరుల సంస్మరణ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ పోలీసు పరేడ్ మైదానం నుంచి ఆర్టీసీ, కేవీఆర్ పెట్రోల్ బంకు మీదుగా పోలీసు మైదానం వరకు సాగింది. ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ, ఏఎస్పీ సౌజన్య, డీఎస్పీలు, సీఐలు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజిత వేజెండ్ల, నగరంలో పోలీసుల ర్యాలీ

నేటి డిగ్రీ పరీక్షలు వాయిదా

వెంకటాచలం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వీఎస్‌యూ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో బుధవారం జరగాల్సిన డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత ఓ ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు, వాతావరణ ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా వీసీ అల్లం శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పరీక్షలను తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. మిగతా పరీక్షలు యథావిధిగా జరుగుతాయన్నారు. వాయిదా వేసిన పరీక్షలకు సంబంధించిన పున:షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	260

కోడిగుడ్ల ధర (100): 560

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.12340
వెండి కిలో ధర	రూ. 1,65,000
వెండి ఒక గ్రాము	రూ.171.00

రాళ్లపాడుకు సోమశిల జలాలు

లింగసముద్రం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మరో నాలుగైదు రోజుల్లో సోమశిల నుంచి కృష్ణా జలాలు రాళ్లపాడు ప్రాజెక్టుకు రానున్నాయి. ప్రభుత్వ జీవో మేరకు ప్రాజెక్టుకు 1.5 టీఎంసీ నీరుల చేరుతుందని, దీంతో ప్రాజెక్టు ఆయకట్టు రైతుల కల నెవేరనుంది.వర్షాలు కురవకపోతే ఈనెల 23 తరువాత ప్రాజెక్టులోకి సోమశిల జలాలు వస్తాయని అధికారుల ద్వారా తెలిసింది.అయితే సోమశిల జలాలను ప్రాజెక్టుకు అందించే కాలువ పనులు వారం క్రితం పూర్తైనట్టు ప్రాజెక్టు డీఈఈ ఎం వెంకటేశ్వర్లు మంగళవారం చెప్పారు.

దగదర్తిలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం



అమరవీరులకు నివాళులర్పిస్తున్న పోలీసులు, న్యాయవాది

దగదర్తి (బిట్రగుంట) అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పోలీస్‌స్టేషన్లో న్యాయవాది, సామాజిక వేత్త ఇర్ల వెంకటరమణయ్య ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. విధి నిర్వాహణలో అసువులు బాసిన అమరవీరులకు ఎస్‌ఐ జంపానికుమార్, సిబ్బంది నివాళులర్పించారు. బోగోలు పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ ప్రభాకర్ సిబ్బందితో కలిసి పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు.

సుబ్బానాయుడి మృతి టీడీపీకి తీరని లోటు

● సుబ్బానాయుడు, భానుచందర్ చిత్రపటాలకు ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఘన నివాళి



సుబ్బానాయుడు, భానుచందర్‌ల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, టీడీపీ నేతలు

కావలి, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ రాష్ట్ర చైర్మన్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు, ఆయన సోదరుడు రవీంద్రనాయుడి తనయుడు మాలేపాటి భానుచందర్‌ల మృతి టీడీపీకి తీరని లోటని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. దగర్తి మండలానికి చెందిన మాలేపాటి కుటుంబంలో ఈనెల 20 వ తేదీ తెల్లవారుజామున మాలేపాటి సుబ్బానాయుడు, 18వ తేదీ రాత్రి మాలేపాటి బానుచందర్‌లు మృతి చెందటంతో దగదర్తి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కావలి ఏరియా వైద్యశాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో వారిద్దరి చిత్రపటాలకు ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, టీడీపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుబ్బానాయుడు పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేశారని, ఆయనతో పాటు యువ నాయకుడు భానుచందర్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో కావలి ఏఎంసీ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుత్తికొండ క్రిషోర్, జ్యోతిబాబూరావు తదితరులు పాల్గొన్నారు. కమ్మవారి సేవాసమితి ఆధ్వర్యంలో వెంగళరావునగర్‌లోని కార్యాలయం లో మాలేపాటి సుబ్బానాయుడు, భానుచందర్ చిత్రపటాలకు నాయ కులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీకి, కమ్మవారి సేవా సమితి అభివృద్ధికి వారు చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు మాకినేని మాల్యాద్రి, నాయకులు పాల్గొన్నారు.

పొరుగు సేవల సిబ్బందికి ఈఎస్‌ఐ, పీఎఫ్ ప్రాథమిక హక్కు

ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి



పొరుగు సేవల సిబ్బందికి సమ దుస్తులు, రెయిన్ కోట్లు పంపిణీ చేస్తున్న సురేష్ రెడ్డి

కావలి (టౌన్) అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పొరుగు సేవల సిబ్బందికి ఈఎస్‌ఐ, పీఎఫ్ ప్రాథమిక హక్కు అని ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపు రెడ్డి సురేష్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో కావలి డిపో మేనేజర్ ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సురేష్ రెడ్డి సొంత నిధులతో పొరుగు సేవల సిబ్బందికి సమదుస్తులు, రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. పారిశుధ్య సిబ్బందిని సత్కరించారు. ఆర్టీసీ డిపోలో పనిచేసే పారిశుధ్య కార్మికులు సరుకు రవాణా (కార్గో)లో పనిచేసే సిబ్బంది ఆర్టీసీకి గుండెకాయ లాంటి వారన్నారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం లేని సిబ్బందికి 15 రోజుల్లో ఆయా సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎం కల్పన, బీజేపీ సీనియర్ నేతలు బ్రహ్మానందం, వీవీ రంగారెడ్డి, కంచర్ల మురళీకృష్ణ, బెల్లంకొండ మాల్యాద్రి, సీవీసీ సత్యం, మందా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న మాల్యాద్రిగౌడ్, మిత్ర బృందం

కలిగిరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పంచాయతీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం జై గౌడ ఉదయగిరి నియోజకవర్గ అధ్యక్షుడు మాల్యాద్రి దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలిగిరి పట్టణంలో సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల్యాద్రి స్నేహితులు గౌస్‌పీర్, మస్తాన్, పొన్నం చిన్న, చింతంరెడ్డి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు బోల్తా.. పలువురికి స్వల్ప గాయాలు

డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రాణాపాయం



పొలాల్లో బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

జలదంకి, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): జలదంకి మండలం నాగిరెడ్డిపాలెం క్రాస్‌రోడ్ సమీపంలో మంగళవారం ఉదయం కావలి ఆర్టీసీ డిపో బస్సు ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి పక్కనే ఉన్న పంటపొలాల్లోకి దూసుకెళ్ళింది. ఎదురుగా వస్తున్న లారీ డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో బస్సుపైకి లారీ దూసుకువచ్చింది. దీంతో అప్రమత్తమైన ఆర్టీసీ డ్రైవర్ చాకచక్యంగా బస్సును రోడ్డుమార్జిన్‌కు తీసుకుపోయాడు. జాతీయరహదారి కొత్తగా నిర్మాణం జరగడంతో టైర్లు ఊడిపోయి బస్సు పొలాల్లోకి వెళ్ళి బోల్తా పడింది. కావలి నుండి చామదల మీదుగా నెల్లూరుకు వెళ్తున్న ఈ బస్సులో 10మంది ప్రయాణీకులు ఉన్నారు. బస్సు బోల్తా పడడంతో ప్రయాణీకులు భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్ అప్రమత్తతో స్వల్పగాయాలతో ప్రయాణీకులు బయటపడ్డారు. బస్సును కావలి ఆర్టీసీ డిపో సిబ్బంది క్రేన్ సాయంతో బయటకు తీసి డిపోకు తరలించారు. లారీ ఆగకుండా కావలి వైపు వేగంగా వెళ్ళిపోయింది. ఈ సంఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

రహదారులపై ఆవుల సంచారం

● ప్రమాదాల బారిన వాహనదారులు



బస్టాండ్ సెంటర్‌లో రహదారిపై సేదతీరుతున్న ఆవులు

ఉదయగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో సాయంత్రమైతే చాలు ఇలా ఆవులు రహదారులపై సేదతీరుతూ పాదచారులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. అసలే ఇరుకైన బస్టాండ్‌లో సాయంత్రం సమయాన ఇతర రాష్ట్రాలకు వెళ్లే బస్సులు అధికంగా బస్టాండ్‌కు చేరుతాయి. ఇటు ఆవులు, అటు బస్సులతో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. ఒకానొక సమయంలో ఆవులు ఒకదానికొకటి పొడుచుకుంటూ ప్రజలు, వాహన దారులపైకి వస్తుండడంతో వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆవులను నిరోధించాలని అధికారులకు పలువురు విన్నవించినా ఫలితం శూన్యం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆవుల సంరక్షకులను హెచ్చరించి వాటిని సంరక్షించుకునేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వర్షాల వేళ.. అప్రమత్తంగా ఉండండి!



తూర్పు ఎర్రబల్లిలో వర్షానికి రోడ్డుపై చేరిన నీరు

అల్లూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలానికి భారీ వర్ష సూచన ఉన్నం దున తీరప్రాంతంలో మత్స్య కారులు, మండల ప్రజలు అప్రమత్తంగా ఉండా లని డీటీ ప్రవీణ్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అల్పపీడనం వాయుగుండంగా మారి బుధ, గురు వారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉం దన్నారు. తీరం వెంబడి 45 నుంచి 65 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తా యన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని, ప్రజలు చెట్ల కిందకు వెళ్లరాదని పేర్కొ న్నారు. మండలంలో మంగళవారం 32.4 మి.మీ వర్షపాతం నమోదైందన్నారు.

కొండాపురం : మండలంలో మంగళవారం మోస్తరు జల్లులు కురిశాయి. ఉదయం వరకు 13.4 మి.మీ వర్షపాతం నమోదు కాగా, రాత్రి ఎడతెరిపి లేకుండా జల్లులు పడుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం కారణంగా ఎవరూ బయటికి వెళ్లి ప్రమా దాలకు గురికావద్దని, ఏవైనా ఇబ్బందులు తలెత్తితే సంబంధిత వీఆర్వోలకు తెలియజేయాలని తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు.

బిట్రగుంట: బోగోలు మండలంలో అల్ప పీడన ప్రభావంతో రెండురోజులుగా జోరు గా వానలు కురుస్తున్నాయి. పలు చోట్ల నీరు నిల్వ ఉండిపోయి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీసీరోడ్ల కార ణంగా వర్షపు నీరు వెళ్లే వీలు లేక ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయింది. బిట్రగుంట పంచాయతీ కొండబిట్రగుంట దళిత, గిరిజన కాలనీలలో మంగళవారం వర్షపు నీరు నిల్వ ఉండిపోయింది. విశ్వనాథ రావు పేట పంచాయతీ ఇబ్రహీంపేట ముస్లీం వీధిలో వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో సర్పంచ్ గండూరి మంజుల, పంచాయతీ కార్యదర్శి జాలయ్య, టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు వెంటనే పనులు చేపట్టారు. బోగోలు కుమ్మరవీధి, యాదవపాలెలో వర్షపు నీరు రోడ్డుపై నిల్వ ఉంది.

వర్షాలతో కళ తప్పిన దీపావళి

ఉదయగిరి రూరల్; అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటా వెలుగులు నింపాల్సిన దీపావళి పండుగ సంబరాలు సోమవారం నివాసాలకే పరిమితమవడంతలో కళ తప్పినట్లయ్యింది. కురుస్తున్న వర్షాలకు తోడు ఆశించిన మేర దుకాణాలు లేకపోవడంతో కొనుగోలుదారుల సంఖ్య కూడా తగ్గుముఖం పట్టింది. గతంలో పల్లెలోను ఇతర వ్యాపారులు సాగించే వ్యక్తులు పండుగ సందర్భంగా బాణాసంచా అమ్మకాలు సాగించేవారు. దీంతో స్థానికంగా ఉండే అన్ని వర్గాల ప్రజలు వాటిని కొనుగోలు చేసి ప్రధాన కూడళ్ల, వీధుల్లో కాలుస్తూ సంబరాలు జరుపుకునేవారు. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేసిన నిబంధనలతో కేవలం పట్టణాలకే దుకాణాలు పరిమితమయ్యాయి. అదీనూ అరకొరగా మాత్రమే ఉండడంతో అదే అదునుగా భావించిన కొంతమంది వ్యాపారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరించి అధిక మొత్తంలో ధరలు నిర్ణయించారు. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబీకులు నామామాత్రపు కొనుగోలుతోనే సర్దుకోవాల్సి వచ్చింది. వీటికితోడు రోజుల తరబడి కురుస్తున్న వర్షాల పుణ్యమాని పల్లె ప్రజలు ఇతర పట్టణాలకు ప్రయాణాలు సాగించలేక నివాసాలకే పరిమితమయ్యారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో అరకొర వ్యాపారాలతో ఒకవైపు దుకాణదారులు, అమాంతం పెరిగిన ధరలకు తోడు వాతావరణం సైతం అనుకూలంగా లేకపోవడంతో ప్రజలు ఈ ఏడాది సంతోషాల నడుమ పండుగను నిర్వహించుకోలేదని చెప్పుకోవచ్చు.

ఘనంగా దీపావళి



ఆత్మకూరు గురుకుల పాఠశాలలో దీపావళి సంబరాలు జరుపుకుంటున్న విద్యార్థులు, మున్సిపల్ కౌన్సిలర్లు

ఆత్మకూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆత్మకూరు పట్టణ సమీపంలో ఉన్న గురుకుల పాఠశాలలో పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు విద్యార్థులతో కలిసి బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, శివకోటారెడ్డి, జి వేణు, రాజశేఖర్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బాలకృష్ణ, ప్రిన్సిపాల్ రూత్ తదితరులు పాల్గొన్నారు.

●**ఉదయగిరి:** మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం దీపావళి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

●**దుత్తలూరు:** మండలంలోని అన్ని గ్రామాల్లో దీపావళిని ప్రజలు వైభవంగా నిర్వహించారు. కుటుంబ సమేతంగా ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు.

ఎడతెరిపిలేని వర్షాలతో ప్రజల అవస్థలు

● స్తంభించిన జన జీవనం ● లోతట్టు ప్రాంతాల జలమయం ● పొంగి పొర్లుతున్న డ్రైనేజీలు



ఆత్మకూరు: పంటవీధిలో నిలిచిన వర్షపు నీరు



ఉదయగిరి వీధుల్లో ప్రవహిస్తున్న వర్షపు నీరు

ఆత్మకూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మున్సిపాల్టీ పరిధిలోని వీవర్స్ కాలనీ, పేరారెడ్డిపల్లి బీసీ కాలనీ, జెఆర్‌పేట, సుందర్ నగర్, నెల్లూరుపాళెంలోని పలు ప్రాంతాల్లో వర్షపునీరు ఇళ్లల్లోకి రావడంతో ప్రజలు అవస్థలకు గురయ్యారు. 8వ వార్డు పరిధిలో పలుచోట్ల వర్షపునీరు రోడ్లపై నిల్వ ఉండిపోయాయి. పంటవీధిలోని అంతర్గత రోడ్లు బురదమయం అయ్యాయి. దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.

●**అనంతసాగరం:** మండలంలో మంగళవారం ఎడతెరపిలేని వర్షం కురిసింది. దీంతో ప్రజలు అవస్థలు పడ్డారు. అనంతసాగరంలో వీధులు జలమయం కాగా బస్టాండ్ వెనుక వీధి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇక పాతాళపల్లి, గోవిందమ్మపల్లి తదితర గ్రామాల్లో వరి కోతలు జరుగుతుండగా రైతులకు అవస్థలు తప్పలేదు.

●**ఉదయగిరి:** ఎడతెరిపిలేని వర్షాలతో ఉదయగిరి పట్టణంలోని వీధులు కాలువలను తలపిస్తున్నాయి. డ్రైనేజీలు పొంగిపొర్లుతుండడంతో ప్లాస్టిక్, ఇతరత్రా వ్యర్థాలు రహదారులపై చేరడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ బస్టాండ్ ప్రాంతం వర్షపు నీటితో చెరువును తలపిస్తోంది. ఈ వర్షంతో రబీ సీజన్ పంటల సాగుతోపాటు ఉద్యాన పంటలకు మేలు చేకూరుతోందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

●**ఉదయగిరి రూరల్ :** వరికుంటపాడు మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో ప్రజలు నివాసాలకే పరిమితమయ్యారు. గ్రామాల్లోని రహదారులు, నివాసాల సముదాయాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మెట్ట, ఉద్యాన పంటలకు సానుకూలంగా మారుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీ విభజనకు వ్యతిరేకంగా తీర్మానం

ఉదయగిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలాపురం పంచాయతీ విభజనను వ్యతిరేకిస్తూ పాలకవర్గం మంగళవారం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. పంచాయతీని విభజన చేయాలంటూ ఇటీవల పంచాయతీకి చెందిన కొందరు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. దీంతో అధికారులు రెండు పర్యాయాలు పంచాయతీలో గ్రామసభ ఏర్పాటుచేశారు. ఆ సభలకు సభ్యులు ఎవరూ హాజరు కాకపోవడంతో కోరంలేక వాయిదా వేశారు. తాజాగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొల్లుబోయిన కృష్ణ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి నాగూర్‌బీ పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తొమ్మిది వార్డుసభ్యులు హాజరై విభజనను వ్యతిరేకిస్తూ పంచాయతీ ప్రజలంతా కలిసి ఉంటామని ఏకగ్రీవ తీర్మానం చేశారు.

సేవా పుస్తకాల అందజేత

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులకు మంగళవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో సేవా పుస్తకాలు అందజేశారు. శాఖ జిల్లా కౌన్సిలర్ ఎస్ హరిశ్చంద్ర ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు పీ మాలకొండయ్య ఆ పుస్తకాలను అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు ఎల్‌వీ నారాయణ, నాయకులు డీ రమణయ్య, జీ హజరత్, పీ మనోహర్, శ్యామల, స్రవంతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్ రైలు ఢీకొని మహిళ మృతి

కావలి రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీ కొని బీ క్రిస్టిన (43) మృతి చెందిన సంఘటన మంగళవారం స్థానిక బుడంగుంట రైల్వే గేట్ సమీపంలో జరిగింది. జీఆర్పీ పోలీసుల వివరాల మేరకు.. మృతురాలి తల్లి దండ్రులు 7 సంవత్సరాల క్రితం మృతి చెందగా, వారి ఇద్దరు కుమారైలు, కుమారుడికి కూడా మానసిక స్థితి సరిలేదు. పట్టణంలోని క్రిష్టియన్‌పేట మొదటి లైన్‌లోని చర్చి ఫాదర్ జోయల్ ప్రేమ్‌కుమార్ సంరక్షణలో వీరు ఉంటున్నట్లు తెలిపారు. మతి స్థిమితం లేని అవివాహితురాలైన క్రిస్టిన ఉదయం ట్రాక్ దాటుతుండగా 3వ లైన్‌లో నెల్లూరు వైపు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీ కొనటంతో అక్కడికక్కడే మృతి చెందింది. లోకో పైలెట్ ఫిర్యాదు తో సంఘటనా స్థలాన్ని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ ఢీకొని మూడు గేదెలు...

సీతారామపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలంగారిపల్లి గ్రామ సమీపానల గల 167-బీజీ జాతీయ రహదారిపై లారీ ఢీకొని మూడు గేదెలు మృతిచెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. సీతారామపురం నుంచి ఉదయగిరికి వెళుతున్న ఇండేన్ గ్యాస్ సిలిండర్ల లారీ పోలంగారిపల్లి గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న గేదెలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. చనిపోయిన గేదెల విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోవూరులో పూరిల్లు దగ్ధం

కోవూరు, (ఆంధ్రజ్యోతి) : స్థానిక గ్రంథాలయం వీధిలోని ఓ ఇంట్లో దీపం కిందపడటంతో మంటలు ఎగసి మంగళవారం ఓ పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. లైబ్రరీ వీధిలో నివాసముంటున్న మాధవి ఇంట్లో దేవుని మందిరంలో పూజ చేసి దీపం వెలిగించగా ఇల్లు కాలింది.

వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి



ఆశ్రమం వద్ద పెన్నానదిని పరిశీలిస్తున్న తహసీల్దారు వెంకటేశ్వర్లు

కలువాయి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సోమశిలకు భారీ వరద హెచ్చరికల నేపథ్యంలో మంగళవారం రాజుపాళెం పరమానంద ఆశ్రమాన్ని తహసీల్దారు డి వెంకటేశ్వర్లు సందర్శించారు. సోమశిల డ్యాంకు కింది వైపున పెన్నానది ఒడ్డున ఉన్న ఆశ్రమానికి వరద తాకిడి ఉండే అవకాశం ఉండటంతో ఆశ్రమ నిర్వాహకులకు ఆయన పలు సూచనలు ఇచ్చారు. ఆశ్రమంలో భక్తులను రాత్రులు బస చేయకుండా పంపించాలని కోరారు. పెన్నానది వైపు ఎవ్వరూ వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు తహసీల్దారు సూచించారు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు

కలువాయి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక బస్టాండు సెంటర్‌లోని పోలీసు అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళుర్పించారు. రాపూరు సీఐ ఎన్ సత్యనారాయణ, ఎస్‌ఐ ఎస్ కోటయ్య ఆధ్వర్యంలో పోలీసులు ర్యాలీ నిర్వహించిన అనంతరం అమరవీరుల స్థూపం వద్ద కలువాయికి చెందిన అనకర్ల కేశవులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

కలువాయి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం తోపుగుంటలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. రైతులకు కొత్తగా ఇచ్చిన యూరియా కార్డుల మీద ఏకరాకు బస్తా వంతున అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కళారాణి, మండల టీడీపీ ఉపాధ్యక్షులు జీ.హరిబాబు, గంగవరపు చంద్రమౌళి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన పాప తల్లిదండ్రులకు అప్పగింత

ఏఎస్‌పేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన పాపను వారి తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు. వివరాల మేరకు.. మహరాష్ట్ర రాష్ట్రంలోని నాందేడ్‌కు చెందిన దంపతులు మంగళవారం ఏఎస్‌పేట దర్గాకు విచ్చేశారు. ఈ తరుణంలో తమ సుమారు 3సంవత్సరాల వయస్సు గల పాప తప్పిపోయింది. బస్టాండ్ సెంటర్‌లో ఏడుస్తున్న పాపను గుర్తించిన పోలీసులు పాప తల్లిదండ్రుల ఆచూకీ తెలుసుకొని వారిని పోలీస్‌స్టేషన్ పిలిపించి పాపను వారికి అప్పగించారు.

భూగర్భ డ్రైనేజీ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలి : డీఈ



సిబ్బందితో సమీక్షిస్తున్న డీఈ రామకృష్ణ

సీతారామపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సీతారామపురంలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణ సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిక్విడ్ వేస్ట్, గ్రేవాటర్ మేనేజ్‌మెంట్ కోసం జిల్లాలో సీతారామపురం గ్రామాన్ని అధికార యంత్రాంగం ప్రతిపాదించిందన్నారు. గ్రామంలో ఎంతవరకు డ్రైనేజీ అవసరం, వర్షపాతం, విలేజ్ లేఅవుట్, మ్యాప్ ద్వారా గ్రామంలో సర్వే చేపట్టి ప్రతిపాదనలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో రఘునాథ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనీనిషి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుమతి, వీఆర్వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి ఆనం, ఎమ్మెల్యే కాకర్ల పర్యటన

దుత్తలూరు(ఉదయగిరి), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని వింజమూరు, దుత్తలూరు మండలాల్లో బుధవారం రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌లు పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వారు తొలుత వింజమూరు మండలం గుండెమడగల గ్రామంలో సీతారామస్వామి ఆలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అనంతరం దుత్తలూరు మండలం నర్రవాడలో ఉన్న వెంగమాంబ పేరంటాలమ్మతల్లిని దర్శించుకుంటారన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.